23 వ తానా మహా సభలు 2023

# 'కథా' కేళి

## తెలుగులో కథలు చెప్పే పోటీ

## 100 చిట్టి కథల నమూనా పుస్తకం



నిర్వహణ

తానా - తెలుగు పరివ్యాప్తి బృందం

# పెద్దల మాట



ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు వారందరికి నమస్కారం! తానా (TANA) మన మాతృ భాష తెలుగు అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందనేది మీ అందరికి విదితమే. తానా ప్రపంచ సాహిత్య వేదిక, చైతన్య స్రవంతి, సాంస్కృతిక కళలు, పాఠశాల ద్వారా తెలుగు పరివ్యాప్తికి అనేక మంది సాహితీ దిగ్గజాలు, కళాకారులు, యువత మరియు పిల్లలను ప్రోత్సహించి మంచి మంచి కార్యక్రమాలు మీ ముందుకు తీసుకురావడంలో నిరంతరం కృషి చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. తానా (TANA) 'మన యువతే మన వారసత్వం' అని గట్టిగా నమ్ముతుంది. తానా తెలుగు పరివ్యాప్తి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ చినసత్యం వీర్నపు మరియు వారి బృందం వినూత్నంగా మీ ముందుకు తీసుకు వస్తున్న 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ పిల్లలకు తెలుగు పై మక్కువ కలిగిస్తుందని, ప్రతిభాపాటవాలు పెంచుకోవడంలో దోహద పడుతుందని విశ్వసిస్తున్నాను. 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా నిర్వహించే ఈ పోటీలలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. రాబోయే కాలంలో తానా (TANA) తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, విశిష్ఠత కోసం మరిన్ని కార్యక్రమాలు మీ ముందుకు తీసుకువస్తుంది అని ఆశిస్తూ... పిల్లలకు తెలుగు నేర్పించండి. ఇంటిలో తెలుగులోనే మాట్లాడండి. మన భాషను బ్రతికించండి. తెలుగు భాష పరివ్యాప్తికి తోడ్పడండి. సర్వేజన సుఖినోభవంతు.

**- అంజయ్య చౌదరి లావు, తానా అధ్యక్షులు (2021-2023)**

---



తెలుగు వారందరికి శుభాభినందనలు! మన అమ్మ భాష 'తెలుగు కమ్మదనాన్ని మీ అందరికి అందించడానికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం చేస్తున్న కృషి అనిర్వచనీయం. తానా 23 వ మహా సభలకు ప్రముఖ కవులు, రచయితలు మరియు సాహితీ వేత్తలను ఆహ్వానించడంతో పాటు ప్రపంచ సాహిత్య వేదిక, పాఠశాల ద్వారా తెలుగు పరివ్యాప్తికి అనేకమంది సాహితీ వేత్తలను మీ ముందుకు తీసుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా వుంది. తానా తెలుగు పరివ్యాప్తి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ చినసత్యం వీర్నపు మరియు వారి బృందం వినూత్నంగా పిల్లలకు మేధస్సు పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలు మెరుగు పడడానికి ఉపయోగపడే 'కథా కేళి' నీతి కథలు పోటీలు పిల్లలకు తెలుగుపై మక్కువ కలిగిస్తుందని, ప్రతిభాపాటవాలు పెంచుకోవడంలో దోహదపడుతుందని విశ్వసిస్తున్నాను. ఈ పోటీలలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. తెలుగు వారు అందరూ జూలై 7-9 వ తేదీల్లో ఫిలడెల్ఫియాలో జరగబోయే 23 వ తానా మహా సభలలో భాగస్వాములు కావాలని కోరుకుంటూ...సర్వేజన సుఖినోభవంతు

**- రవి పొట్లూరి, తానా కాన్ఫరెన్స్ కో-ఆర్డినేటర్, 23 వ తానా మహాసభలు, 2023**

---



దాదాపు ఐదు దశాబ్దాలుగా తెలుగు భాష, సాహిత్యం, ఆచార వ్యవహారాలను ప్రవాస దేశంలో పరిరక్షించి పరివ్యాప్తం చెయ్యడంలో తానా సంస్థ చేస్తున్న కృషి సర్వ విదితమే. తానా సంస్థ ఆవిర్భవించిన (1977) తొలి రోజులతో పోల్చితే ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ తెలుగువారి సంఖ్య అనూహ్యం. జనాభా పెరుగుదలతో పాటు సవాళ్ళూ పెరుగుతూనే ఉన్నాయి. కాని అన్ని రంగాలలోను మన రెండో తరం, మూడో తరం తెలుగు సంతతి వారు సాధిస్తున్న ప్రగతి ఎంతైనా శ్లాఘనీయం. ఈ ఉన్నతికి తెలుగు మూలాలున్న తల్లిదండ్రులు వారి పిల్లలకు అందిస్తున్న ప్రోత్సాహం వెల కట్టలేనిది.

అమెరికాలో తెలుగువారు ఎక్కడ ఏ స్థితిలో ఉన్నా మన అందర్నీ కలిపి ఉంచేది మధురమైన మన తెలుగు భాష. ఈ భాష పరంపరగా కొనసాగడం కోసం, పిల్లలలో భాషానురక్తి కల్గించడం కోసం 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా నిర్వహించే తానా-తెలుగు పరివ్యాప్తి కమిటీ 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ పిల్లలలో పోటీ తత్త్వం పెంచడం ముదావహం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం మనందరి విజ్ఞత.

**- డా॥ ప్రసాద్ తోటకూర, తానా పూర్వాధ్యక్షులు, నిర్వాహకులు-'తానా ప్రపంచ సాహిత్య వేదిక'.**

---



'దేశ భాషలందు తెలుగు లెస్స'. అమ్మ రూపమే భాష. అమృత జలపాతం - నా తెలుగు భాష. జగత్తు లో ఆది గురువు 'అమ్మ'. అమ్మ పిల్లలకు నేర్పే భాషే 'మాతృ భాష'. ప్రవాసంలో నివసిస్తున్న భావి తరాల కోసం తానా (TANA) తెలుగు పరివ్యాప్తికి, కళలు, సాహిత్యంపై చేస్తున్న సేవ అనిర్వచనీయం. తల్లిదండ్రులు పిల్లలకు మాతృభాష ప్రాముఖ్యాన్ని చిరు ప్రాయం నుంచి నేర్పిస్తే వారికి భాషపై మక్కువ పెరిగి, భాషాభివృద్ధికి, తెలుగు భాషా పరిరక్షణకు దోహదపడుతుంది. అలా తెలుగుపై ఆసక్తి వున్న చిన్నారులకి మన భాషపై పటిమ పెంపొందించుకోవడానికి చేయూతగా 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా తానా తెలుగు పరివ్యాప్తి బృందం వారు నిర్వహిస్తున్న 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ - నమూనా పుస్తకం దోహదపడుతుంది.

ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి, నిర్వహణలో ప్రత్యేకంగా సహాయ సహకారాలు అందిస్తున్న చొక్కాపు వెంకటరమణ, డా॥ తోటకూర ప్రసాద్, మురళి వెన్నం, సతీష్ కొమ్మన, రవి పొట్లూరి, ఫణి కంతేటి, తానా పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు తానా కార్యవర్గ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు. పిల్లలకు తెలుగు నేర్పించండి, ఇంటిలో తెలుగులోనే మాట్లాడండి, తెలుగు భాష పరివ్యాప్తికి చేయిచేయి కలపండి, భాషాభివృద్ధికి చేయూతనివ్వండి.

**- చినసత్యం వీర్నపు, చైర్మన్, తానా తెలుగు పరివ్యాప్తి బృందం (2021-2023)**

---



తెలుగు భాష పరిమళం, మాధుర్యం గురించి మన తరంతో పాటు భావి తరాలకు సైతం మక్కువ పెంచే దిశగా 'తానా' మంచి కవులు, సాహితీ వేత్తలను మీ ముందుకు తీసుకు వస్తూ, తెలుగుభాష పరిరక్షణ, ఉనికి కోసం చేస్తున్న కృషి అభినందనీయం. 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా 'తానా'తెలుగు సాహిత్యం, తెలుగు భాష పరివ్యాప్తి పై పలు మాధ్యమాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల్లో మీతో పాటు మీ పిల్లలను భాగస్వాములను చేసి, మరిన్ని కార్యక్రమాలను మీ ముందుకు తీసుకురావడానికి సహకరించాలని కోరుకుంటూ...

**- సతీష్ కొమ్మన, ప్రాంతీయ ప్రతినిధి, డాలస్**

---



తెలుగు భాషను ప్రవాస భారతీయ బాలలకు, యువ జనులకు మరింత చేరువ చేసేందుకు 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా తానా - తెలుగు పరి వ్యాప్తి బృందం చేపట్టిన 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ ఎంతో గొప్ప ఆలోచన. 100 చిట్టి కథలు రాసి, నేను సంపాదకత్వం వహించిన నమూనా కథల పుస్తకం ఆసక్తికరంగా తీర్చిదిద్దే అవకాశం నాకు కల్పించిన పెద్దలందరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. రకరకాల కళా ప్రక్రియలలో కథలు చెప్పేందుకు కథాకేళి పోటీలలో పాల్గొని విజయం సాధించవచ్చు. కథాకేళిలో పాల్గొనేందుకు వయోపరిమితి లేదు. పోటీలో పాల్గొనండి. మీ భావ ప్రకటన సామర్థ్యం ప్రదర్శించండి. విజేతలు కండి.

**- చొక్కాపు వెంకటరమణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత**

# 'కథా' కేళి

## తెలుగులో కథలు చెప్పే పోటీ

### 100 చిట్టి కథల నమూనా పుస్తకం

**బాల్య విభాగం**
12 ఏళ్ళ లోపు వయసు వారికి

**కౌమార విభాగం**
13 నుండి 19 ఏళ్ళ వయసు వారికి

**యౌవన విభాగం**
20 ఏళ్ళ వయసు పైబడిన వారికి


రూపకల్పన

**డా॥ ప్రసాద్ తోటకూర**

**చినసత్యం వీర్నపు**

పున: కథనం - రచన - సంపాదకత్వం

**చొక్కాపు వెంకటరమణ**



పుస్తకాలంకరణ

**ఎన్విజన్ డిజైనింగ్ స్టూడియో**

నిర్వహణ

**అంజయ్య చౌదరి లావు**
తానా అధ్యక్షులు

**రవి పొట్లూరి**
తానా కాన్ఫరెన్స్ కో-ఆర్డినేటర్

**ఉత్తర అమెరికా తెలుగు సంఘం**
**తానా - తెలుగు పరివ్యాప్తి బృందం**

## 23 వ తానా మహా సభలు 2023

# 'కథా'కేళి

# తెలుగులో కథలు చెప్పే పోటీ ఎందుకు?

'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ. కథలు చెప్పటం మన ప్రాచీన సంస్కృతి.
మన తాత ముత్తాతల నుంచి మనకు సంక్రమించిన వారసత్వం.
మన సంప్రదాయాలను, ఆచారాలను, అభిరుచులను ముందు తరాలకు పరిచయం చేసే ప్రక్రియ.
కథలు చెప్పడం ఒక విద్యా పరికరం. తెలుగు భాష మీద పట్టును కలిగించి, జ్ఞాపక శక్తిని పెంచే కళ.
భావ ప్రకటనా పటిమను పెంపొందించే ప్రయోగం. మానవ సంబంధాలను మెరుగు పరిచే మాధ్యమం.
ఉత్తమ వ్యక్తిత్వాన్ని, మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని బలపరిచే సాధనం.
సభా కంపం పోగొట్టి, వక్తృత్వ ప్రతిభను పెంచి, ధైర్యంగా తలెత్తుకుని నిలబడేలా చేసే ఆయుధం.
కథను సంక్షిప్తంగా చెప్పటం - విస్తరించి వినిపించడం కథాకేళి పోటీలోని ప్రయోగం.
ఇది తెలుగు భాషా ప్రియులకు మంచి ఫలితాలను ఇచ్చే ప్రయత్నం.

1. ఈ 'కథాకేళి' లో 100 కథలు ఉన్నాయి. అన్నీ పది పంక్తులకు మించని కథలే!
2. ఏ కథ అయినా ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలనుకుంటే అర నిమిషంలో అయిపోతుంది.
3. అయితే పోటీలో - కథని రెండు నిముషాలకు తక్కువ కాకుండా విస్తరించి చెప్పాలి. మూడు నిముషాలకు మించకుండా ముగించాలి.
4. కథను విస్తరించటం వలన మీ ఊహాశక్తి, సృజనాత్మకత పెరుగుతుంది. భాష విస్తృతమవుతుంది. కొత్త పదాలు వాడకంలోకి వస్తాయి.
5. ఈ 'కథాకేళి' పుస్తకం మీకొక మార్గదర్శి మాత్రమే.
6. బాల్య, కౌమార, యౌవన వయోవర్గాల వారు ఎవరైనా ఈ పుస్తకంలోని 100 కథలలోని ఏ కథని అయినా ఎంపిక చేసుకుని చెప్పవచ్చు.
7. ఇవే కాక మీకు వచ్చిన, తెలిసిన ఏ కథని అయినా చెప్పవచ్చు. నిడివి రెండు నిముషాలకు తగ్గ కూడదు. మూడు నిముషాలకు మించ కూడదు.
8. ఒకరు ఒక కథ చెప్పటానికి మాత్రమే అర్హులు
9. మీరు తీసుకునే కథాంశం. కథ చెప్పే తీరు. భావప్రకటన. అభినయం. కంఠ స్వరంలో మార్పులు. వస్త్రధారణ. మీరు కథకు ఉపయోగించే పరికరాలు - వీటిని న్యాయనిర్ణేతలు పరిగణనలోకి తీసుకుంటారు.
10. తెలుగు భాషను పటిష్ట పరుచు కోవటానికి వ్యాకరణంతో పని లేని ఉపకరణం 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ. మీరూ, మీ పిల్లలు 'కథాకేళి' పోటీలో తప్పక పాల్గొని. తెలుగు భాషకు హారతి పట్టండి.

# కథలు చెప్పే కళ

## STORY TELLING



**S** కథాంశం
SUBJECT



**T** సమయ పరిమితి
IME LIMIT



**O** సొంతదనం
RIGINALITY



**R** హేతు దృక్పథం
ATIONAL THINKING




**Y** కొత్తదనం
OUTHFULL NESS




**T** చెప్పే పద్ధతి
ECHNIQUE



**E** వినోద భరితంగా
NTERTAINMENT



**L** భాషాభివృద్ధి
ANGUAGE DEVELOPMENT



**L** శ్రవణ నైపుణ్యం
ISTENING SKILL



**I** ఆసక్తి కలిగేలా
NTEREST



**N** వివాద రహితంగా
ON-CONTRO VERCIAL



**G** మంచి ముగింపు
OOD ENDING



### 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా
### 'కథాకేళి' తెలుగులో కథలు చెప్పే పోటీ కోసం 100 చిట్టి కథలు
### రాసిన నమూనా పుస్తక రచయిత, సంపాదకులు

# చొక్కాపు వెంకటరమణ

## పరిచయం

'పిల్లలే నా ప్రపంచం' అని భావించే చొక్కాపు వెంకటరమణ పిల్లల కోసం వివిధ అంశాలపై 100 పుస్తకాలు రాశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ బాలల అకాడమీలో 'బాల చంద్రిక' పిల్లల పత్రికకు 18 ఏళ్లు సంపాదకులుగా పనిచేశారు. బాల సాహిత్య పరిషత్ అధ్యక్షులుగా బాలలకు కథా రచన, గేయ రచన. కథలు చెప్పడంలో అనేక కార్య శాలలు నడిపారు. భారత దేశంలో తొలి సారిగా తెలుగులో కథలు చెప్పే పండుగ 'కథాకేళి'ని ఏడు రోజుల పాటు నిర్వహించారు. 100 నిముషాల్లో 100 కథలు చెప్పి ప్రపంచ రికార్డు సృష్టించారు. 'స్టోరీ పోటర్', 'కథాతపస్వి' బిరుదులు పొందారు. 'ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలను కథలలా చెప్పాలి'అనే అంశం మీద అనేక పాఠశాలల్లో కార్యశాలలు నడిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) జరిగిన 'బాలోత్సవాలు' - పిల్లల పండుగలలో ప్రధాన భూమికను పోషించారు.

బాల సాహిత్య రంగానికి చొక్కాపు వెంకటరమణ అందించిన సేవలకు గుర్తింపుగా 2015 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో గౌరవించింది. 2018 లో డా. రామినేని ఫౌండేషన్ భారత ఉప రాష్ట్రపతి గౌరవనీయులు ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా విశేష పురస్కారం ఇచ్చి సత్కరించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతోనూ, బాలసాహితీ పురస్కారంతోనూ ప్రశంసించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా బాల సాహితీ వేత్తగాను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'తెలుగు భాషా సేవ విశిష్ట పురస్కారం'తోను గౌరవించాయి.

చొక్కాపు 'మేజిక్ ఫన్ స్కూల్' స్థాపించి 5000 మంది బాలలకు ఇంద్రజాలం లో ఉచిత శిక్షణ ఇచ్చారు. తెలుగులో తొలి వ్యక్తిత్వ వికాస మాస పత్రిక 'ఊయల' నడిపారు. ఇంద్రజాలంలో దేశవిదేశాలలో 7000 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ముగ్గురు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు 'కవి సామ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ, డా. సి. నారాయణ రెడ్డి, డా. రావూరి భరద్వాజల డిక్టేషన్లు రాసే అవకాశం చొక్కాపు వెంకటరమణ కు దక్కింది.

ఇంపాక్ట్ (IMPACT) వ్యక్తిత్వ వికాస శిక్షణా సంస్థను 1995లో స్థాపించి వేలాది మందికి వ్యక్తిత్వ వికాసంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. తానా - తెలుగు పరివ్యాప్తి బృందం 2022 లో అంతర్జాలం ద్వారా నిర్వహించిన 'తెలుగు తేజం' భాషా పటిమ పోటీల కోసం మూడు పాఠ్య ప్రణాళికా గ్రంథాలు రాసి, సంపాదకత్వ బాధ్యతలు వహించారు. పోటీల నిర్వహణ కర్తగా వ్యవహరించారు.

చొక్కాపు వెంకటరమణ రాసిన రచనలు హిందీ, కన్నడ భాషలలో కి అనువాదం అయ్యాయి. గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు చొక్కాపు రచనలు కొన్ని పాఠ్యాంశాలుగా పెట్టాయి. 60 ఏళ్ల కళా, సాహితీ రంగాల సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వ తపాలా శాఖ, తెలంగాణ సర్కిల్ చొక్కాపు వెంకటరమణ 73వ పుట్టిన రోజు 2022 ఏప్రిల్ 1న ప్రతిష్ఠాత్మకమైన 'తపాలా చంద్రిక' స్పెషల్ కవర్' ను విడుదల చేసి గౌరవించింది.


Chokkapu Venkata Ramana | +91 92465 20050 | e-mail: magiccho@gmail.com

'కథా'కేళి

## బాల్య విభాగం

12 ఏళ్ళు లోపు వయసు వారికి

### నాన్నా! పులి




ఒక బాలుడు పొలంలో మేకలను మేపుతున్నాడు. పక్కనే ఉన్న అడవిలో నుంచి అప్పుడప్పుడు పులి వచ్చి మేకలను ఎత్తుకుపోయేది. బాలుడు 'నాన్నాపులి!' అని గట్టిగా అరిచాడు. పక్క పొలంలో పని చేసుకునే బాలుడి తండ్రి పరుగున వచ్చాడు.' ఊరకే తమాషాగా అరిచాను!' అన్నాడు బాలుడు. తండ్రి తిట్టి వెళ్ళిపోయాడు. కాసేపటికి బాలుడు మళ్ళీ అరిచాడు. తండ్రి కంగారు పడుతూ వచ్చాడు. 'నీవు వస్తావో రావో చూడాలని అరిచాను' అన్నాడు బాలుడు నవ్వుతూ. 'అలా ఊరకే అరవకు' అని చివాట్లేసి తండ్రి వెళ్ళి పోయాడు. ఈసారి నిజంగా పులి వచ్చింది. బాలుడు 'నాన్నా పులి!' అని గొంతు చించుకుని అరిచాడు. 'వాడు ఊరకే అలాగే అరుస్తాడు' అనుకుని తండ్రి రాలేదు. పులి ఒక మేకని చంపి అడవిలోకి ఈడ్చుకు పోయింది.

**అబద్ధాలాడే వాడు నిజం చెప్పినా ఎవరూ నమ్మరు**

### బాతు - బంగారు గుడ్డు

ఒక పేదవాడు ఒక బాతుని పెంచుతున్నాడు. అది రోజుకి ఒక బంగారు గుడ్డు పెట్టేది. అతడు దానిని అమ్మి కుటుంబం నడిపే వాడు. ఒకనాడు ఆ పేదవాడికి ఒక దురాశ కలిగింది. 'రోజుకి ఒకటే బంగారు గుడ్డు ఏమిటి? బాతు పొట్ట కోస్తే బోలెడు బంగారు గుడ్లు ఉంటాయి. ఒకేసారి పెద్ద ధనవంతుడిని అయిపోవచ్చు' అనుకున్నాడు. వెంటనే బాతు పొట్ట కోశాడు. రక్తమాంసాలు తప్ప బాతు పొట్టలో బంగారు గుడ్లు లేవు. పేదవాడు లబోదిబోమన్నాడు.

**దురాశ వల్ల దుఃఖం కలుగుతుంది**



## కుక్క - గాడిద

ఒక బట్టలు ఉతికేవాడు ఒక గాడిదను, కుక్కను పెంచుతున్నాడు. గాడిద రేవు నుండి బట్టలు మోసుకు వచ్చేది. కుక్క ఇంటికి కాపలా ఉండేది. ఒకనాటి అర్ధరాత్రి ఒక దొంగ ఆ ఇంట్లో దూరాడు. గాడిద,కుక్క దొంగను చూశాయి. అయినా కుక్క మొరగ లేదు. 'దొంగ యజమాని ఇంటిని దోచుకు పోతాడు. నీవు అరవ వేమిటి ?' అంది గాడిద కుక్కతో. 'నాకు తిండి సరిగా పెట్టని యజమాని కోసం నేనెందుకు అరవాలి?' అంది కుక్క. 'యజమాని ఉప్పు తింటున్నాం. నీవు అరవకపోతే నేనే అరుస్తా!' అంటూ గాడిద గట్టిగా ఓండ్ర పెట్టింది. దొంగ పారిపోయాడు. యజమాని లేచాడు. బంగారం లాంటి నిద్ర పాడు చేసిందని గాడిదని చావ బాదాడు.

**కుక్క పని కుక్క చేయాలి-గాడిద పని గాడిద చేయాలి.**



## కాకి దాహం

అది వేసవి కాలం. ఒక కాకికి దాహం వేసింది. నీటి కోసం చాలా చోట్ల వెతికింది. దానికి ఎక్కడా నీరు దొరక లేదు. చివరికి దానికి ఒక కుండ కనిపించింది. కాకి ఆశగా ఆ కుండ మీద వాలింది. అడుగున కొంచెమే నీరు ఉంది. అది కాకి ముక్కుకి అందటం లేదు. దానికి ఒక ఉపాయం తట్టింది.

చిన్నచిన్న గులక రాళ్ళు తెచ్చి కుండలో వేసింది. రాళ్ళతో కుండ నిండింది. నీరు పైకి వచ్చింది. కాకి నీరు తాగింది. దాని దాహం తీరింది.


**ఉపాయం ఉంటే అవసరాలు తీరతాయి**



## కాకి తెలివి



ఒక చెట్టు మీద ఒక కాకి గూడు కట్టుకొని ఉంది. ఆ గూడులో గుడ్లు పెట్టింది. ఆ చెట్టు కింద ఒక పుట్ట ఉంది. దానిలో ఒక పాము ఉంది. ఆ పాము కాకి లేనపుడు గూడులోకి పాకి వచ్చేది. కాకి గుడ్లను తినేసి పోయేది. కాకికి ఇలా చాలా సార్లు అన్యాయం జరిగింది. కాకి పామును ఎదిరించలేదు. దానికి ఒక ఉపాయం తట్టింది. ఒకనాడు ఆ దేశపు రాజకుమారి ఒక కొలనులో స్నానం చేస్తోంది. ఒడ్డున ఉన్న ఆమె నగలలోని ఒక హారాన్ని కాకి ముక్కున కరుచుకుంది. అది సైనికులు చూశారు. కాకిని వెంటాడారు. కాకి ఎగురుతూ వచ్చింది. చెట్టు కింద పుట్టలో ఆ హారాన్ని జార విడిచింది. సైనికులు చూశారు. పుట్టను తవ్వారు. పాము బయటికి వచ్చింది. దానిని చంపారు. హారం తీసుకు పోయారు.




ఉపాయం ఉంటే అపాయం దాటవచ్చు.

## కుక్క - మాంసం ముక్క

ఒక కుక్కకి ఒక మాంసం ముక్క దొరికింది. దానిని నోట కరుచుకుని పరుగు తీసింది. దారిలో ఒక కాలువ మీద వంతెన ఉంది. కుక్క వంతెన మీదకి వచ్చింది. కింద నీటిలోకి చూసింది. నీటిలో దాని నీడ కనపడింది. వేరే కుక్క అనుకుంది. దాని నోట్లో ముక్క కోసం 'భౌ! భౌ!'అని అరిచింది. కుక్క నోటిలోని మాంసం ముక్క జారి నీటిలో పడింది. ముక్క కోసం కుక్క నీటిలోకి దూకింది. తడిసి పోయింది. ముక్క పోయిందని కుక్క దిగులుగా ఇంటి దారి పట్టింది.

ఇతరుల సొమ్ముకు ఆశ పడకు.



## గోరింక గొప్ప

ఒక పొలంలో గోరింక గూడు కట్టుకుంది. పిల్లలతో ఉంది. ఒకరోజు ఆహారం కోసం వెళ్ళిన గోరింక ఇంటికి రాగానే పిల్లలు అరిచాయి. 'ఈ పొలం రైతు రేపు పంట కోయ డానికి పని వారికి పురమాయించాడు. మనం వేరే చోటుకి పోదామా!' అన్నాయి పిల్లలు.'పని వారిని నమ్మితే పని జరగదు. మనకేం భయం లేదు' అంది గోరింక. రెండో రోజు 'రైతు రేపు బంధువులను పిలిచాడు. పంట కోస్తారట' అన్నాయి పిల్లలు.' అది జరిగే పని కాదు' అంది గోరింక. బంధువులు రాలేదు. పని జరగ లేదు. 'రేపు రైతు స్వయంగా పంట కోస్తాడట' అని గోరింకతో పిల్లలు చెప్పాయి. 'రైతు స్వయంగా పనిలోకి దిగితే పని జరుగుతుంది. వేరే చోటుకి పోదాం పదండి' అని గోరింక పిల్లల్ని తీసుకుని అక్కడి నుంచి వెళ్ళి పోయింది.


ఇతరుల మీద ఆధార పడితే పనులు జరగవు.




## కోతి - మొసలి

ఒక నది ఒడ్డున చెట్టు. దాని మీద ఒక కోతి ఉండేది. నది నీటిలో ఒక మొసలి ఉండేది. రెండూ స్నేహంగా ఉండేవి. కోతి నేరేడు పళ్ళు కోసి మొసలికి నీటిలోకి విసిరేది. అవి కొన్ని తిని, కొన్ని భార్యకు తీసుకు పోయేది మొసలి. 'ఈ పళ్ళు తినే కోతి గుండెకాయ తినాలని ఉంది. తీసుకురా' అంది ఒకరోజు ఆడ మొసలి. నది అవతల పళ్ళ చెట్ల దగ్గరికి తీసికెళతానంది మొసలి. కోతిని తన మీద ఎక్కించుకుంది. నది మధ్యలోకి వెళ్ళాక అసలు విషయం చెప్పింది మొసలి. 'చెట్ల మీద నుంచి అటూ ఇటూ దూకుతాం. గుండె ఎక్కడ జారి పడి పోతుందోనని చెట్టుకి తగిలించాను. ఇస్తాను పద' అంది కోతి. మొసలి సరేనంది. కోతిని ఒడ్డుకి తెచ్చింది. కోతి ఒడ్డుకి దూకింది.
'స్నేహంగా ఉండి ద్రోహం చేస్తావా?
గుండెను ఎక్కడైనా చెట్టుకి వేలాడ తీస్తారా?
వెర్రివాడా ఫో ఫో!' అంది కోతి.

నమ్మిన వారిని మోసగించరాదు











## ఏడు చేపలు

ఒక రాజుకి ఏడుగురు కొడుకులు. వారు వేటకు పోయారు. ఏడు చేపలు తెచ్చారు. ఎండలో వేశారు. అందులో ఒక చేప ఎండలేదు.' చేపా! చేపా! ఎందుకు ఎండలేదు?' అడిగారు. 'గడ్డి మోపు అడ్డం వచ్చింది'. 'గడ్డిమోపూ! ఎందుకు అడ్డం వచ్చావు?' 'ఆవు నన్ను మేయలేదు', 'ఆవూ! ఎందుకు మేయలేదు?' 'పనివాడు నన్ను విప్పలేదు' 'పనివాడా! ఆవుని ఎందుకు విప్పలేదు?' 'అవ్వ అన్నం పెట్టలేదు', 'అవ్వా! పనివాడికి అన్నం ఎందుకు పెట్టలేదు ' 'పాప ఏడ్చింది' 'పాపా! ఎందుకు ఏడ్చావ్?' 'చీమ కుట్టింది' 'చీమా! చీమా! పాపని ఎందుకు కుట్టావ్?' 'నా బంగారు పుట్టలో వేలు పెడితే నేను కుట్టనా?!' అంది చీమ.

పని చేయడానికి సాకులు చెప్పరాదు.






## కుందేలు - తాబేలు

ఒక అడవిలో కుందేలు, తాబేలు స్నేహంగా ఉండేవి. ఒకసారి అవి పరుగు పందెం వేసుకున్నాయి. కుందేలు వేగంగా పరుగెత్తి చాలా దూరం పోయింది, వెనక్కి తిరిగి చూసింది. తాబేలు ఎక్కడో దూరంగా ఉంది. మెల్లగా నడిచి వస్తోంది. 'తాబేలు నాతో ఎలా గెలుస్తుందిలే' కాసేపు విశ్రాంతి తీసుకుంటాను' అనుకుంది కుందేలు గర్వంగా. ఒక చెట్టు కింద నిద్ర పోయింది. తాబేలు మెల్ల మెల్లగా నడిచి వచ్చి నిద్ర పోయిన కుందేలును దాటి గమ్యం చేరింది. గెలిచింది.

గర్వం ఉంటే విజయం దక్కదు



## నక్క - ద్రాక్ష



ఒక నక్కకి ఆకలి వేసింది. ఆహారం వెతుకుతూ బయలు దేరింది. దారిలో ద్రాక్ష తీగలు అల్లుకున్న చెట్టు కనిపించింది. ద్రాక్ష గుత్తులు వేలాడుతున్నాయి. నక్కకి నోరు ఊరింది. ద్రాక్షల కోసం పైకి ఎగిరింది. కింద పడింది. ద్రాక్షలు అందలేదు. మళ్ళీ ఎగిరింది. మళ్ళీ పడింది.



అలా చాలా సార్లు ఎగిరింది. అయినా నక్కకి ద్రాక్షలు అందలేదు . నక్కకి నిరాశ కలిగింది . చిరాకు వేసింది. 'ఛీ! ఛీ! ఈ ద్రాక్షలు పుల్లగా ఉంటాయి. ఇవి నాకు వద్దు' అనుకుంటూ తన దారిన పోయింది.

**అందని ద్రాక్ష పుల్లన**

## ఐకమత్యం

ఒక ధనవంతుడికి నలుగురు కొడుకులు. వారు ఎప్పుడూ తగవు లాడుకుంటూ ఉండేవారు. తండ్రి ఎంత చెప్పినా వినేవారు కాదు. ధనవంతుడు దిగులుతో జబ్బు పడ్డాడు. ఒకనాడు ఆయన నలుగురు కొడుకులను దగ్గరకు పిలిచాడు. ఒక పుల్లల కట్ట వారికి ఇచ్చాడు. ఒక్కొక్కరిని విరవమన్నాడు. ఎంత బలం ఉపయోగించినా విరవలేక పోయారు. ఒక్కొక్క పుల్ల ఇచ్చి విరవమన్నాడు. సునాయాసంగా విరిచారు.'చూశారా! విడివిడిగా ఉన్న పుల్లలను తేలికగా విరిచారు. కట్టగా ఉన్న వాటిని విరవ లేక పోయారు. అలాగే మీరు తగవు లాడుకుంటూ, విడిపోయి ఉంటే అందరికీ చులకన అవుతారు. ఐకమత్యంగా ఒకే మాట మీద కలసి ఉంటే మిమ్మల్ని ఎవరూ ఓడించ లేరు'. అని చెప్పాడు తండ్రి. కొడుకులకు కనువిప్పు కలిగింది.

**కలసి ఉంటే కలదు సుఖం**



## మూడు గొడ్డళ్లు



ఒక కట్టెలు కొట్టేవాడు అడవికి వెళ్ళాడు. ఒక కొలను పక్కనే ఉన్న చెట్టును ఎక్కాడు. గొడ్డలితో కొమ్మను నరక బోయాడు. చేయి జారింది. గొడ్డలి కొలనులో పడింది. తన బతుకు తెరువుకి గొడ్డలి అవసరం. అతడు గొడ్డలి కోసం భోరున ఏడవ సాగాడు. కొలను లోంచి ఒక దేవత పైకి వచ్చింది. ఒక బంగారు గొడ్డలిని తెచ్చి అతనికి ఇవ్వబోయింది. 'తల్లీ! నాది బంగారు గొడ్డలి కాదు' అన్నాడు. రెండోసారి వెండి గొడ్డలిని తెచ్చి చూపింది దేవత. 'అమ్మా! ఈ వెండి గొడ్డలి కూడా నాది కాదు' అన్నాడు కట్టెలు కొట్టేవాడు. మూడో సారి కొలను లోంచి ఇనుప గొడ్డలి తెచ్చి చూపింది దేవత. 'ఈ ఇనుప గొడ్డలి నాదే!' అన్నాడు. అతడి నిజాయితీకి మెచ్చి బంగారు, వెండి, ఇనుప గొడ్డళ్ళు మూడూ అతడికి ఇచ్చింది. దేవత మాయమయింది.


**నిజాయితీగా ఉంటే మంచి జరుగుతుంది**

## బంగారు కడియం

ఒక పులి ముసలిది అయింది. వేటాడే సత్తువ పోయింది. ఆహారం సంపాదనకు ఒక ఉపాయం ఆలోచించింది. ఆ దారిన పోయే వారికి ఒక బంగారు కడియం చూపించి ఆశ పెట్ట సాగింది. 'నేను ముసలిదాన్ని. కదలలేను. ఎన్నో పాపాలు చేశాను. పుణ్యం కోసం ఈ బంగారు కడియం ఎవరికైనా దానం ఇవ్వాలని అనుకున్నాను.

వచ్చి తీసి కెళ్ళండి' అని చెప్పసాగింది. ఒక ఆశపోతు అటుగా వచ్చాడు. పులి మాటలు నమ్మాడు. బంగారు కడియం కోసం ఆశ పడ్డాడు. పులి దగ్గరకు వచ్చాడు. వెంటనే పులి అతని పైకి దూకింది. అతడిని చంపి తినేసింది.

**అత్యాశ ప్రాణాంతకం**





## నీలి తోడేలు


ఒక తోడేలు అడవి పక్కన ఊరికి వెళ్ళింది. బట్టలకు అద్దకం వేసే నీలిరంగు తొట్టెలో జారి పడింది. తోడేలు నీలి రంగుగా మారిపోయింది. అడవిలో మిగతా జంతువులు దానిని వింతగా చూశాయి. 'ఈ అడవిని పాలించమని దేవుడు నన్ను దూతగా పంపాడు' అని చెప్పింది తోడేలు. జంతువులను నమ్మించింది. అడవిలోని జంతువులు దానికి దాసోహం అన్నాయి. దాంతో నీలి తోడేలుకి పొగరు పెరిగింది. జంతువులపై అధికారం చూపసాగింది. ఒక రోజు ఆకాశం మబ్బులతో నిండింది. తోడేలు ఆనందంతో 'ఊళ' వేసింది. వాన మొదలయింది. నీలి తోడేలు ఒంటి రంగు వానకి తడిసింది. కరిగి కారి పోయింది. తోడేలు రంగు బయట పడింది. ఇంతకాలం తమను మోసగించిన తోడేలును తరిమి కొట్టాయి జంతువులు.

**ఎప్పటికైనా మోసం రంగు బయట పడుతుంది**

## ఆవు - పులి

ఒక ఆవు ఉంది. మేత కోసం అడవికి వెళ్ళింది. ఒక పులి దానిని అడ్డుకుంది. చంపబోయింది. తనను చంప వద్దని పులిని బతిమాలింది ఆవు. 'ఆకలితో ఉన్నాను. నిన్ను చంపక తప్పదు' అంది పులి. ' ఇంటి దగ్గర చిన్న దూడ పిల్ల ఉంది. అది ఆకలితో నా కోసం ఎదురు చూస్తుంది. దానికి పాలు ఇచ్చి తిరిగి వస్తాను' అంది ఆవు . ఆవు మాటలు నమ్మింది పులి. ఇంటికి వెళ్ళనిచ్చింది. ఆవు వెళ్ళింది. దూడకు పాలు ఇచ్చింది. మాట ప్రకారం పులి దగ్గరికి తిరిగి వచ్చింది. ఆవు సత్యమే చెప్పింది. పైగా ఆచరించి చూపించింది. ఆవు నిజాయితీకి మెచ్చింది పులి. ఆవుని వదిలేసింది.

**సత్యం పలికితే ఫలితం బాగుంటుంది.**





బాల్య

## పాము - ముంగిస

రైతు దంపతులు ఉన్నారు. వారికి ఆరునెలల కొడుకు. ఒకనాడు పసివాడిని ఊయలలో వేశారు. పెంపుడు ముంగిసను కాపలా పెట్టారు. పని మీద బయటికి వెళ్ళారు. వారు ఇంటికి తిరిగి వచ్చే సరికి గుమ్మంలో ముంగిస ఎదురయింది. దాని మూతి నిండా రక్తం. పసివాడిని ముంగిస కొరికి చంపేసిందని రైతు కంగారు పడ్డాడు. కోపంతో, ఆవేశంలో ముంగిసను కొడవలితో నరికి చంపేశాడు. ఇంట్లోకి వెళ్లాడు. పసివాడి ఊయల దగ్గర చూశాడు. ఒక పాము రెండు ముక్కలై రక్తపు మడుగులో చచ్చి పడి ఉంది. పసివాడు నవ్వుతూ ఆడుకుంటున్నాడు. పసివాడిని రక్షించటానికి ముంగిస పాముతో పోరాడి దానిని చంపిందని అర్థం అయింది. తన తొందరపాటుకి రైతు బాధ పడ్డాడు.

**తొందరపాటు అనర్థదాయకం**




## పిల్లి మెడలో గంట

ఒక ఇంటిలో ఎలుకలు చాలా ఉన్నాయి. ఒక పిల్లి వాటిని వేటాడి తినేయ సాగింది. ఆ పిల్లి బెడద ఎలా తప్పించుకోవాలో తెలియ లేదు. ఎలుకలన్నీ సమావేశం అయ్యాయి. 'ఎలుకల మీదికి వచ్చేటప్పుడు పిల్లి చప్పుడు తెలియాలి. అందుకే దాని మెడలో ఒక గంట కట్టాలి' అని ఆలోచించాయి ఎలుకలు. ఉపాయం బాగుంది. ఎలుకల కష్టాలు తీరతాయి. కానీ, పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు? ఎవరూ ముందుకు రాలేదు.అందరికీ ప్రాణ భయం. చివరికి పిల్లిమెడలో ఎవరూ గంట కట్ట లేదు.

**ధైర్యం చేస్తేనే సమస్య తీరుతుంది**



## నా కోడి - నా కుంపటి




చిన్న పల్లెలో ఒక అవ్వకు ఒక కోడి ఉండేది. తెల్లవారే అది 'కొక్కొరోకో' అని అరిచేది. ఆ ఊరి వారు కోడి కూత విని నిద్ర లేచేవారు. పనులు చేసుకునే వారు. అలాగే అవ్వ తన ఇంటి ముందు నిప్పుల కుంపటి పెట్టుకుని కూర్చునేది. పనులకు పోయే వారు అక్కడ ఆగి కుంపటి దగ్గర చలి కాచుకునే వారు. నిప్పు అవసరమైన వారు తీసుకుపోయే వారు. అలా ఆ ఊరి వారికి అవ్వ కోడితో- కుంపటితో రోజూ అవసరం ఉండేది. 'నా కోడి -నా కుంపటి లేకపోతే ఈ ఊరి వారు బతక లేరు' అనే గర్వం అవ్వకి కలిగింది. 'అందరికీ నా గొప్పతనం తెలియ జేయాలి' అనుకుంది. ఒక నాటి ఉదయమే తన కోడినీ, కుంపటినీ తీసుకుని పొరుగూరు వెళ్ళిపోయింది. 'తను లేకపోవడంతో గ్రామస్తుల జీవితాలు తలకిందులు అయి ఉంటాయి అనుకుంది. వారిపై జాలి పడింది. పది రోజులకి ఊరికి తిరిగి వచ్చింది, ఆ ఊరి జనం హాయి గానే ఉన్నారు. అవ్వను ఎవ్వరూ పట్టించుకో లేదు.

**ఎవరు లేక పోయినా ఎవరి జీవితమూ ఆగిపోదు**

## నక్క విందు


ఒక కొంగ, నక్క స్నేహితులు. నక్క జిత్తులమారి. ఒకనాడు నక్క తన ఇంటికి కొంగని భోజనానికి పిలిచింది. కొంగ వచ్చింది. వెడల్పుగా ఉన్న పళ్ళెంలో పలచటి పాయసం పోసి కొంగను తినమంది నక్క. ఆ పాయసం తాగటం కొంగకి కుదరలేదు! 'నీకు చేత కావటం లేదా? ఇలా తినాలి' అని పాయసాన్ని నాకి తినేసింది నక్క. మరో రోజు కొంగ తన ఇంటికి నక్కను విందుకి పిలిచింది. నక్క వచ్చింది. కొంగ పొడవైన సన్న మూతి గల కూజాలో పాయసం పోసి తినమంది. నక్కకి కూజాలోని పాయసం అందలేదు! 'ఇది ఇలా తినాలి!' అంటూ కొంగ కూజాలో తన పొడవైన ముక్కుని పెట్టి పాయసం పీల్చేసింది. నక్క ఉసూరు మంటూ ఇంటి దారి పట్టింది.

**కుక్క కాటుకు చెప్పు దెబ్బ**









## కోతులు - టోపీల వాడు

ఒక టోపీల వాడు చాలా దూరం ప్రయాణం చేశాడు. అలసి పోయాడు. ఒక మర్రి చెట్టు కింద ఆగాడు. టోపీల మూట పక్కన పెట్టుకున్నాడు. నిద్రపోయాడు. ఆ చెట్టు మీద చాలా కోతులు ఉన్నాయి. అవి కిందికి దిగి వచ్చాయి. ఒక్కోటి ఒక్కొక్క టోపీ తీసుకున్నాయి. తలపై పెట్టుకున్నాయి. చెట్టు ఎక్కాయి. టోపీల వాడు మేలుకున్నాడు. కోతులను చూసి గతుక్కుమన్నాడు. అతనికి తెలుసు. మనం ఏం చేస్తే కోతులు అదే చేస్తాయి. కోతులను చూసి తల గోక్కున్నాడు. కోతులు కూడా అలానే తల గోక్కున్నాయి. తన తల మీది టోపీని తీసేసి నేల కేసి విసిరి కొట్టాడు. కోతులన్నీ తమ తలల మీది 'టోపీలను తీసి నేల మీదికి విసిరి కొట్టాయి. అంతే, టోపీల వాడు వాటిని ఏరుకున్నాడు. టోపీలు మూట కట్టుకున్నాడు. తన దారిన పోయాడు.

**కోతి బుద్ధి చంచలం**

## భలే తీర్పు

రెండు పిల్లులు ఉన్నాయి. ఒకసారి వాటికి ఒక రొట్టె దొరికింది. 'నాకు పెద్ద ముక్క కావాలి!' అంటూ రెండూ తగవులాడు కున్నాయి. అటుగా వెళుతున్న కోతిని ఆపి తీర్పు చెప్పమన్నాయి పిల్లులు. కోతి రొట్టెను రెండు ముక్కలు చేసింది. 'ఇది పెద్దది' అంటూ దానిని కొంచెం కొరికి తింది. 'ఇప్పుడు ఇది పెద్దది' అంటూ దానిని కొరికింది. అలా కొంచెం కొంచెంగా రొట్టె మొత్తం తినేసింది కోతి. పిల్లులు తాము మోస పోయి నట్లు తెలుసు కున్నాయి.

**తగవులాట వల్ల మూడో వాడికి మేలు**






'కథా'కేళి

బాల్య

## తెలివైన కుందేలు



మృగరాజు అడవిలోని జంతువులను చంపి తినేయ సాగింది. 'రోజుకొక జంతువును ఆహారంగా పంపుతాం' అని సింహంతో జంతువులు ఒప్పందం చేసుకున్నాయి. అలాగే రోజుకో జంతువు సింహానికి ఆహారం కాసాగింది . ఒకనాడు కుందేలు వంతు వచ్చింది. కుందేలు సింహం దగ్గరికి ఆలస్యంగా వెళ్ళింది. ఆలస్యానికి కారణం అడిగింది సింహం. ' రాజా! దారిలో ఒక సింహం నన్ను అడ్డగించింది. మీ పేరు చెప్పినా లెక్కచేయలేదు. ఎంతో కష్టం మీద తప్పించుకొని వచ్చాను' అంది కుందేలు. 'నన్ను ధిక్కరించిన ఆ సింహాన్ని చూపించు' అరిచింది సింహం. కుందేలు సింహాన్ని ఒక బావి దగ్గరికి తీసుకు పోయింది. సింహం బావిలోకి తొంగి చూసింది. నీటిలో సింహం నీడ కనిపించింది. వేరొక సింహంగా భ్రమ పడింది. సింహం బావిలోకి దూకింది. ప్రాణాలు వదిలింది.

తెలివి ఉంటే తెలుగువ కలుగుతుంది

## మాట్లాడే గుహ

ఒక నక్క ఆహారం కోసం అడవి అంతా తిరిగింది. చివరికి తన గుహకి చేరింది. లోపలికి వెళ్ళబోతూ ఆగింది. తన గుహలోకి పులి వెళ్ళినట్లు అడుగుల ముద్రలు కని పించాయి. గుహలో పులి ఉందో లేదో తెలుసుకోవాలి. నక్క ఒక ఉపాయం ఆలోచించింది. 'గుహా! గుహా! ఎలా ఉన్నావ్?' అని అరిచింది నక్క. లోపల ఉన్న పులి వింది. మౌనంగా ఉంది. 'రోజూ బాగున్నాను' అని జవాబు చెప్పి మాట్లాడేది గుహ. ఈ రోజు మాట్లాడటం లేదు. పొరపాటున వేరే గుహకి వచ్చానా?' అని గట్టిగా అంది నక్క. వెంటనే గుహలోంచి 'బాగున్నాను నక్క బావా!' అంది పులి. నక్క మరో వైపుకి పరుగు తీసింది.

మూర్ఖులు తేలికగా మోసపోతారు







## పట్నం ఎలుక


ఒకసారి పట్నం ఎలుక పల్లెటూరుకి వచ్చింది. పట్నం గొప్పలు చెప్పింది. 'కోరిన తిండి తినవచ్చు. కొత్త రుచులు చూడవచ్చు' అని ఆశ పెట్టింది. పల్లెటూరి ఎలుక ఆశతో దాని వెంట పట్నం వెళ్ళింది. తెల్లవారింది. రెండు ఎలుకలు వంట గదికి చేరాయి. బోలెడు పిండి వంటలు. కమ్మని వాసన. తినబోయాయి. ఎవరో వస్తున్న చప్పుడు అయింది. కలుగులోకి పారిపోయాయి. అలా చాలాసార్లు భయంతో పరుగులు తీశాయి. మధ్యాహ్నం అయింది. పల్లె ఎలుక ఆకలికి ఆగలేక పోయింది. కంటి ఎదురుగా ఉన్న తిండిని తినే అవకాశం లేదు. ఇలా భయపడుతూ తినే కంటే పల్లెటూరులో ప్రశాంతంగా తినవచ్చు. తృప్తిగా ఉంటుంది. 'నీ పట్నం భోజనానికి ఒక దణ్ణం' అంటూ పల్లె ఎలుక తన ఊరి దారి పట్టింది.

**భయపడుతూ తినే తిండి ఒంట పట్టదు**

## కోతి - దూలం


ఒక చోట పనివారు పెద్ద చెట్టు దుంగను నిలువుగా రంపంతో కోస్తున్నారు. మధ్యాహ్నం భోజనం సమయం అయింది. ఆ దుంగ రెండు చీలికల మధ్య ఒక చెక్క శీలను పెట్టారు. పనివారు భోజనానికి వెళ్ళారు. అది ఒక కోతి చూసింది. గబగబా వచ్చింది. దుంగ మీదకి ఎక్కింది. అటూ ఇటూ దొర్లింది. గెంతులు వేసింది. దుంగ చీలిక మధ్య ఒక కాలు పెట్టింది. శీలను బలంగా లాగింది. రాలేదు. మరింత బలం ఉపయోగించింది. శీల ఊడి వచ్చింది. చీలికలో కోతి కాలు ఇరుక్కుపోయింది. ఎంత లాగినా రాలేదు. చీలిక ఇంకా బిగుసుకు పోయింది. గిజగిజలాడింది కోతి. చివరికి ప్రాణాలు వదిలింది.

**మనకు సంబంధం లేని పనుల్లో కాలు దూర్చరాదు**



## కొంగ - నక్క

ఒక నక్క మాంసం తింటోంది. ఒక ఎముక దాని గొంతులో ఇరుక్కు పోయింది. ఎంత ప్రయత్నించినా ఎముక బయటికి రాలేదు. ఒక కొంగ అటుగా వచ్చింది. నక్క దానిని సాయం అడిగింది. కొంగ జాలి పడింది. నక్క నోటిలోకి తన పొడవైన ముక్కును దూర్చింది. ఎముకను తీసేసింది. నక్క బాధ తీరింది. 'నీ గొంతులోని ఎముకను తీశాను. నీ బాధ నుండి కాపాడాను. మరి నాకు ఏమి కానుక ఇస్తావు?' అని అడిగింది కొంగ.




నక్క వెటకారంగా నవ్వింది.
'నీవు నా నోట్లో తలను పెట్టావు. అప్పుడు నీ మెడను కొరికి చంప లేదు. అంత కంటే గొప్ప కానుక ఏమి కావాలి? ఫోపో!' అంది నక్క ఎగతాళిగా.

**దుష్టులకు సాయం చేయరాదు**

## గుర్రం-గాడిద

ఒక వ్యాపారి దగ్గర ఒక గుర్రం, ఒక గాడిద ఉన్నాయి. వాటి మీద సరుకులు వేసుకొని పక్క ఊరికి బయలు దేరాడు. కొంత దూరం పోయాక గుర్రం బతిమాలింది గాడిదను. 'నా మీద బరువు ఎక్కువ అయింది. కొంచెం బరువుని నీవు తీసుకో. ఇద్దరం తేలికగా నడవగలం' అంది గుర్రం. 'నీ బరువును నేనెందుకు మోయాలి? కుదరదు' అంది గాడిద. కాసేపటికి ఆ బరువు మోయలేక గుర్రం చతికిల బడింది. స్పృహ తప్పింది. వెంటనే వ్యాపారి గుర్రం మీది సరుకులు మొత్తం గాడిద మీద వేశాడు. ప్రయాణం సాగించాడు. గాడిద మీద రెండింతలు బరువు పెరిగింది. 'గుర్రం అడిగి నపుడు కొంత బరువుని పంచుకుని ఉంటే ఇంత కష్టం వచ్చేది కాదు. అని దిగులు పడింది గాడిద.

**పొరుగు వారితో బాధ్యతలు పంచుకుంటే ఏదైనా తేలిక అవుతుంది.**






## నల్ల మేక
## నలుగురు దొంగలు

ఒక బ్రాహ్మడు సంతకు వెళ్ళాడు. యజ్ఞం కోసం ఒక నల్ల మేకను కొన్నాడు. దానిని భుజాన వేసుకుని బయలు దేరాడు. అది నలుగురు దొంగలు చూశారు. ఆ మేకను ఎలాగైనా కాజేయాలని అనుకున్నారు. దారిలో ఒక దొంగ ఎదురయ్యాడు. 'పంతులు గారూ! నల్లకుక్కను మోసుకు వెళుతున్నారు ఏమిటి?' అన్నాడు. 'అబ్బే! ఇది నల్ల మేక!' అన్నాడు బ్రాహ్మడు. మరి కొంత దూరం పోయాక ఇంకో దొంగ ఎదురయ్యాడు.' అయ్యో!! నల్ల కుక్కని ఏం చేసుకుంటారు?' అన్నాడు. ఇంకా కొంతదూరం పోయాక మరో దొంగ ఎదురయ్యాడు. 'అయ్యో! పంతులు గారూ! నల్లకుక్క అశుభం' అన్నాడు. నాలుగో దొంగ కూడా ఎదురయ్యాడు. 'నల్లకుక్క ఎందుకు?' అన్నాడు. దాంతో బ్రాహ్మడికి తాను తీసుకుపోతున్నది 'నల్లకుక్కా?' అని అనుమానం వచ్చింది. వెంటనే దానిని అక్కడే వదిలేశాడు. తన దారిన పోయాడు.

**నలుగురు చెప్పిన అబద్ధం నిజం అవుతుంది**




## పాము బుస

ఒక పాము అందరినీ కాటు వేసి చంపేయ సాగింది. జనం భయంతో వణికి పోయారు. ఒక సాధువు అటుగా వచ్చాడు. 'అందరినీ కాటేసి చంపుతున్నావు. పాపం పోగేసుకుంటున్నావు. ఇకపై ఎవరినీ కరవకు. పుణ్యం సంపాదించుకో' అని పాముకి ఉపదేశం చేశాడు. కొంతకాలం తరువాత సాధువు అటుగా వచ్చాడు. ఆ పాము బక్కచిక్కి కొన ప్రాణాలతో ఉంది. 'సర్పమా! ఏమిటిలా ఉన్నావు?' అన్నాడు సాధువు.'అయ్యా! మీరు చెప్పినట్లు ఎవరినీ నేను కరవటం లేదు. జనం అది అలుసుగా తీసుకున్నారు. నన్ను రాళ్ళతో కొట్టి హింసిస్తున్నారు' అంది పాము దీనంగా. 'ఎవరినీ కరవ వద్దని చెప్పాను. కానీ బుస కొట్టవద్దన లేదుగా! బుస కొడితే నీకు భయపడేవారు కదా!' అన్నాడు సాధువు.

**మనం మెత్తగా ఉంటే జనం తొక్కుతారు**





## తాబేలు తెలివి

ఒక తాబేలు చెరువులో నుంచి నేల మీదికి వచ్చింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్న నక్క ఒకటి తాబేలు నడుము మీద కాలు పెట్టింది. అదిమి పట్టింది. దాని నడుముని రక్కింది. అది రాయిలాగా గట్టిగా ఉంది. 'నక్కబావా! నేనెలాగు నీకు దొరికి పోయాను. నా పైని డిప్ప గట్టిగా ఉంటుంది. చెరువు నీటిలో నన్ను నాన బెట్టు. మెత్త బడినాక తిను.' అంది తాబేలు. 'నిజమే' అనిపించింది. నక్క మెల్లగా తాబేలును చెరువు నీటిలోకి తోసుకు పోయింది. తన రెండు ముందు కాళ్ళతో నొక్కి పట్టింది. ఎంత సేపటికీ తాబేలు డిప్ప మెత్తబడలేదు. 'నక్కబావా ! నీవు కాళ్ళు పెట్టిన చోట తడి తగల లేదు. అందుకే అక్కడ గట్టిగా ఉంది. కొంచెం కాళ్ళు పై కెత్తు' అంది తాబేలు. నక్క దాని మాట నమ్మింది. రెండు కాళ్ళు పైకెత్తింది. అంతే, తాబేలు నీటిలోకి జారి పోయింది. ప్రాణాలు దక్కించుకుంది.


**తెలివి ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చు**




## గబ్బిలం బతుకు

ఒకసారి జంతువులకీ, పక్షులకీ యుద్ధం వచ్చింది. ఒక గబ్బిలం గెలిచే అవకాశం ఉన్న జంతువుల దగ్గరికి వెళ్ళింది. 'మృగరాజా! నేను మీలాంటి జంతువునే. నా నోట్లో పళ్ళు చూడండి. మీలాగా నేనూ పిల్లల్ని కంటాను. మీలో కలుపుకోండి' అంది. సింహం సరేనంది. ఆ యుద్ధంలో జంతువులు చాలా చచ్చి పోయాయి. ఈసారి గబ్బిలం పక్షుల వైపుకి వెళ్ళింది. 'నేను మీ పక్షినే. రెక్కలు చూడండి' అంది. పక్షులు దానిని చేరనిచ్చాయి. ఈసారి యుద్ధంలో పక్షుల సంఖ్య తగ్గింది. మరల జంతువుల వైపు వెళ్లింది గబ్బిలం. దాని గోడమీది పిల్లివాటం చూసి జంతువులు, పక్షులు గబ్బిలాన్ని దగ్గరికి రానివ్వ లేదు. చివరికి గబ్బిలాల దగ్గరికి పోయింది. 'నీవు అవకాశ వాదివి. నిన్ను నమ్మము. ఫోఫో!' అని గబ్బిలాన్ని తరిమి కొట్టాయి. చివరికి గబ్బిలం కొండ గుహలలోకి పోయింది. చీకట్లో చెట్ల కొమ్మలకు తల కిందులుగా వేలాడుతూ బతక సాగింది.

**అవకాశవాదిని ఎవరూ నమ్మరు**



## స్నేహితులు






కోడి, పావురం స్నేహితులు. ఒకసారి కోడి గింజలు ఏరుకుని తింటోంది. ఒక నక్క చూసింది. వెనుక నుంచి వచ్చి కోడి మెడను పట్టుకుని నక్క పరుగు తీసింది. అది పావురం చూసింది. కోడిని కాపాడాలనుకుంది. నక్క వెళ్ళే దారిలో చచ్చిపోయినట్లు నేల మీద పడుకుంది పావురం. నక్క పావురాన్ని చూసింది. దాని నోరు ఊరింది. పావురం మాంసం తిని చాలా కాలం అయింది అనుకుంది. నోట్లో ఉన్న కోడిని వదిలి పావురం వైపు వెళ్ళింది. 'కోడి నేస్తం! పారిపో !' అరిచింది పావురం. కోడి గభాల్న పక్కనున్న చెట్టు పైకి ఎక్కింది. నక్క తన సమీపానికి రాగానే పావురం తుర్రున ఎగిరి పోయింది. అలా పావురం కోడిని కాపాడింది.

**ఆపదలో ఆదుకునేవాడే స్నేహితుడు**


## చీమ - మిడత

చీమ కష్టజీవి. రోజూ తిరిగి ఆహారం సంపాదించేది. తన పుట్టలో దాచుకునేది. దానిని చూసి మిడత ఎగతాళి చేసింది. 'బుద్ధి లేనిదానా. ఎప్పుడూ పని చేస్తూనే ఉంటావు. నేను చూడు ఎంత ఆనందంగా తిరుగు తున్నానో!' అంది మిడత. చీమ ఏమీ మాట్లాడలేదు. తన పని తాను చేసుకుపోయింది. వానాకాలం వచ్చింది. జోరుగా వర్షం. మిడతకు ఆహారం దొరకలేదు. ఆకలితో బాధ పడింది. చీమను సాయం అడిగింది. చీమ దానికి తిండి పెట్టింది. 'ఆహార సంపాదనకు నేను తిరుగుతుంటే ఎగతాళి చేశావు. అప్పటి కష్టం ఇప్పుడు పనికి వచ్చింది తెలుసా?' అంది చీమ. మిడతకు కనువిప్పు కలిగింది. కష్టపడే వారిని ఎగతాళి చేయకూడదని తెలుసుకుంది.

**ముందు చూపు ఉంటే సుఖం దక్కుతుంది**



## మాట వినని ఈగ



ఒక ఈగ షికారుగా బయలు దేరింది. దారిలో దానికి సాలె పురుగు కలిసింది.' ఈగా ! ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగింది . 'ఎగిరీ ఎగిరీ రెక్కలు నొప్పి పుడుతున్నాయి. ఎక్కడయినా వాలి విశ్రాంతి తీసుకోవాలి' అంది ఈగ. 'నా గూటిలో వాలు' అంది సాలె పురుగు. 'అమ్మో ! నీ గూట్లో వాలితే ఇంక బయటికి రాలేను' అంది ఈగ. 'అదుగో అక్కడ మా వాళ్ళు చాలామంది ఉన్నారు. నలుగురున్న చోట అయితే క్షేమం' అంది ఈగ. 'అది ఆముదం రాసిన కాగితం. మీ వాళ్ళు దానికి అతుక్కు పోయి గిలగిల లాడుతున్నారు. వెళ్ళకు!' అంది సాలె పురుగు. 'నీకు తెలియదులే. అక్కడే నాకు రక్షణ 'అంటూ వెళ్ళింది ఈగ. అక్కడ వాలింది. కాగితానికి అతుక్కు పోయింది. బయట పడలేక పోయింది. ప్రాణాలు వదిలింది.

**మంచి సలహా వినక పోతే కష్టాలు తప్పవు**


## కప్ప గొప్ప


ఒక చెరువులో ఒక చేప ఉంది. అక్కడికి కొత్తగా ఒక కప్ప వచ్చింది. చేపతో తన గొప్పలు చెప్పుకుంది కప్ప. నేను నీటిలోనూ, నేల మీదా తిరగ గలను. నీవు నేల మీదకి వస్తే బతక లేవు!' అంది కప్ప. చేప మారు పలకలేదు. కప్పకు పౌరుషం వచ్చింది. 'ఏయ్ చేపా! నీవు అసలు మాట్లాడలేవు. నేను బాగా పాటలు పాడగలను విను!' అంటూ బెకబెకమని పాటలు పాడసాగింది.

చెరువు పక్కనే ఒక పుట్ట ఉంది. దానిలో పాము పడుకుని ఉంది.కప్ప బెకబెకలకు పాముకు మెలకువ వచ్చింది. లేచి బయటికి వచ్చింది. కప్పను పట్టుకుని మింగేసింది.

**గొప్పలు చెప్పుకుంటే తిప్పలు తప్పవు**







## కుక్క మెడలో గంట

ఒక కుక్క అందరినీ కరవ సాగింది. దాని కాటుకి చాలా మంది బాధ పడ్డారు. దాని యజమాని జనం ఇబ్బందిని చూశాడు. ఆ కుక్కకి మెడలో ఒక గంటను కట్టాడు. దాంతో కుక్క వస్తుంటే గంట చప్పడు అయ్యేది. అది విని జనం దానికి దూరంగా తప్పించుకునే వారు. ఇదంతా చూసి కుక్కకి గర్వం పెరిగింది. తనను అందరూ గౌరవిస్తున్నారు అనుకుంది. పక్కకి తొలగి దారి ఇస్తున్నారు అని భ్రమ పడింది. తోటి కుక్కతో తన గొప్ప చెప్పుకుంది- 'చూశావా! నన్ను చూసి అందరూ గౌరవంగా పక్కకి తొలుగుతున్నారు?' అంది. ఆ కుక్క గట్టిగా నవ్వింది. నీ మెడలో గంట విని భయంతో తప్పు కుంటున్నారు. అది గౌరవం కాదు' అంది.

**అవమానాన్నీ కొందరు గౌరవంగా భావిస్తారు.**

## నేర్పని విద్య

పిల్లి పులికి మేనమామ. పిల్లికి వచ్చిన విద్యలు తనకు నేర్పమంది పులి. పిల్లి నేర్పింది . ఒక్కో విద్య నేర్చుకుని గ్రామస్తుల్ని హింసించ సాగింది పులి. 'పులి ఎప్పటికైనా ప్రమాదకారి' అని పిల్లి గ్రహించింది. ఒకసారి పులి గ్రామస్తుల మీదకి దాడి చేసింది. వారు పారిపోయారు. చెట్లు ఎక్కి కూర్చున్నారు. పులి చెట్లు ఎక్కలేక పోయింది. పులి పిల్లిని అడిగింది. 'మామా! నాకు అన్ని విద్యలూ నేర్పావు. చెట్లు ఎక్కడం నేర్పలేదేం!' అంది. 'నీవు నేర్చిన విద్యలు ఎలా ఉపయోగిస్తున్నావో చూశాను. ఇతరుల క్షేమం కోసమే నీకా విద్య నేర్పలేదు' అని చెప్పి పిల్లి గభాలున చెట్టు ఎక్కి కూర్చుంది.

**మనం నేర్చిన విద్య మంచికి ఉపయోగించాలి.**






## చీమ - పావురం

ఒక చీమ, పావురం చాలా స్నేహంగా ఉండేవి. ఒకసారి చీమ కొలను నీటిలో పడి మునిగిపోతోంది. పక్కనే చెట్టు మీద ఉన్న పావురం చూసింది. వెంటనే ఒక ఆకుని తెంపి కొలనులో వేసింది. చీమ ఆ ఆకు పడవను ఎక్కింది. ప్రాణాలతో ఒడ్డుకి చేరింది. ఒకసారి ఒక వేటగాడు చెట్టు మీది పావురాన్ని చూశాడు. దానికి బాణం గురి పెట్టాడు. చీమ చూసింది. గబగబా పోయి వేటగాడి కాలుని కుట్టింది. వేటగాడు గట్టిగా అరిచాడు. బాణం గురి తప్పింది. పావురం ఎగిరిపోయింది. చీమ చేసిన సాయానికి కృతజ్ఞత చెప్పింది పావురం.



**ఒకరి కొకరి సాయం - స్నేహంలో న్యాయం**



## సింహం - ఎలుక

ఒక సింహం గుర్రు పెట్టి నిద్ర పోతోంది. ఒక చిట్టెలుక దాని మీదకి ఎక్కి గంతులేస్తూ ఆడింది. సింహం మేలుకుంది. ఎలుక చేష్టలకు కోపం వచ్చింది. దాన్ని సింహం పట్టు కుంది. 'చంపుతా ఎలక పిల్లా!! అంది సింహం కోపంగా. 'సింహరాజా! నన్ను వదిలేయ్. నీకు ఆపదలో సాయ పడతాను'. అంది ఎలుక. సింహం ఫకాలున నవ్వింది. 'నీ సాయం నాకెందుకు.. ఫో !' అని ఎలుకను వదిలేసింది. ఒకసారి సింహం వేటగాడి వలలో చిక్కుకుంది. ఎంతకీ తప్పించుకో లేక పోయింది. అంతలో ఎలుక అటుగా వచ్చింది. సింహాన్ని చూసింది. వల తాళ్ళను కొరికి సింహాన్ని కాపాడింది.

**సాయపడటానికి ఆకారంతో పనిలేదు**



'కథా'కేళి

## కౌమార విభాగం

13 నుండి 19 ఏళ్ళ వయసు వారికి



### పెద్ద మూర్ఖుడు

అడవిలో నడిచి వెళుతున్న కట్టెలు కొట్టుకునే వాడికి ఒక రంగు రాయి దొరికింది. అటుగా వెళుతున్న వజ్రాల వ్యాపారి 'ఇది గాజు రాయి. వంద రూపాయలు ఇస్తాను. నాకు ఇచ్చేయ్' అన్నాడు. 'ఇదేదో విలువైనదే' అనుకుని 'రెండొందలు ఇస్తే ఇస్తాను' అన్నాడు కట్టెలు కొట్టుకునే వాడు. 'మరీ అంత దురాశకు పోకు. పక్క ఊరికి పోయి గంటలో వస్తాను. ఆలోచించుకో' అని చెప్పి వెళ్ళిన వజ్రాల వ్యాపారి గంటలో తిరిగి వచ్చాడు. 'ఇదిగో వంద. ఆ రాయి ఇవ్వు' అన్నాడు వ్యాపారి. 'ఇంకెక్కడి రాయి? ఇంతకు ముందే మరొకరికి వెయ్యి రూపాయలకి అమ్మేశాను'. అన్నాడు. 'ఒరే మూర్ఖుడా ! అది లక్ష రూపాయల విలువ చేసే వజ్రంరా!' అన్నాడు వ్యాపారి. 'దాని విలువ నాకు తెలీదు. విలువ తెలిసి కూడా వంద రూపాయలు అదనంగా ఇవ్వడానికి ఇష్టపడని నీవే పెద్ద మూర్ఖుడివి' అన్నాడు కట్టెలు కొట్టుకునేవాడు.

సరైన సమయానికి సరైన నిర్ణయం తీసుకోవాలి.

### చావు భయం

రాజు గారి మందిరంలో ముత్యాల హారం పోయింది. అక్కడున్న ముగ్గురు కాపలా వారిలో దొంగ ఎవరో కని పెట్టమని మంత్రికి పురమాయించాడు రాజు. 'ముగ్గురూ తలలు వంచుకొని ప్రార్థించండి. తలారి మీలో హారం దొంగిలించిన వాడి తలను మాత్రమే నరుకుతాడు' అన్నాడు మంత్రి. ముగ్గురూ తలలు వంచుకున్నారు. సోమన్న అనే కావలి వాడు మాత్రం మాటి మాటికి తల ఎత్తి చూడసాగాడు. 'మహారాజా! వీడే దొంగ. హారం దొంగిలించాడు కాబట్టే ప్రాణ భయంతో మాటి మాటికి తల పైకెత్తి చూస్తున్నాడు' అన్నాడు మంత్రి. సోమన్న నేరం ఒప్పుకుని హారం తెచ్చి ఇచ్చాడు.

తప్పు చేసిన వాడిని భయం వెంటాడుతూనే ఉంటుంది







## సూది కోసం

పరమానందయ్య అనే గురువు ఉండేవాడు. ఆయనకి పదమూడు మంది శిష్యులు. వారు పరమ తెలివి తక్కువ వారు. ఒకసారి గురువు గారి కాలికి ముల్లు గుచ్చుకుంది. దాన్ని తీయడానికి సూది కావాలని గురువు గారు చెప్పారు. ఇంకేం శిష్యులంతా సూది కోసం ఊరంతా వెతికారు. ఒక రైతు 'పాపం ' అని  జాలిపడి ఒక సూదిని ఇచ్చాడు. శిష్యులంతా ఆ సూది 'నాకు కావాలంటే నాకు కావాలని' రైతు మీదికి ఎగబడ్డారు వారి అమాయకత్వం చూసిన ఆ రైతు నవ్వుకున్నాడు. 'నలుసంత సూదిని తీసుకు పోవటానికి ఇంత మందా? సరే నేను ఒక ఉపాయం చెబుతాను. మా పెరట్లో ఒక దూలం ఉంది. దానికి ఈ సూది ని గుచ్చి మోసుకుంటూ వెళ్ళండి' అని సలహా ఇచ్చాడు. అంతే వెంటనే శిష్యులు ఆ దూలానికి సూదిని గుచ్చి మోసుకుంటూ గురువు గారి వద్దకు బయలుదేరారు. ఊళ్ళోవాళ్ళు అంతా ఈ వింతని చూసి విరగబడి నవ్వుకున్నారు.

**తెలివి లేకపోతే శ్రమ పెరుగుతుంది**







## వ్యవధి

తన కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డ సేవకులను రాజు అడిగాడు. 'నాతో పాటు అగ్ని గుండంలో దూకుతారా? సముద్రంలో దూకుతారా?' అని. ఎవరూ జవాబు చెప్పలేదు. 'ప్రభూ! మీతో పాటు అగ్ని గుండంలో దూకడానికి నేను సిద్ధం. సముద్రంలో దూకడానికి నెల రోజులు వ్యవధి కావాలి' అన్నాడు ఒకడు. 'నీకు ప్రాణాల మీద ఆశ లేదా? నాతో పాటు అగ్ని గుండం లోకి దూకడానికి సిద్ధం అయ్యావు. మరి సముద్రంలో దూకడానికి నెల రోజులు వ్యవధి ఎందుకు?' అడిగాడు రాజు.

'ప్రభూ! మీరెలాగూ అగ్నిలోకి దూకరు. సముద్రంలోకి దూక గలరు. నాకు ఈత రాదు. అందుకే ఈత నేర్చు కోవడానికి నెల రోజులు వ్యవధి కావాలి' అన్నాడు సేవకుడు. రాజు అతని తెలివికి మెచ్చుకుని బహుమతులు ఇచ్చాడు.

**పనికి ముందు సాధ్యాసాధ్యాలు తెలుసుకోవాలి**



## రక్షణ

రాజుగారి అంగ రక్షకుడి పదవికి నలుగురు పోటీ పడ్డారు. వారిలో చురుకైన వాడిని ఎంపిక చేయటం మంత్రి బాధ్యత. 'రాజుగారు వేటకు అడవికి వెళ్ళి ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్నారు. హఠాత్తుగా పెద్ద పులి ఆయన మీదకి దూకింది అప్పుడు మీరేం చేస్తారు?' అడిగాడు మంత్రి. 'కత్తి దూసి పులిని చంపుతాం' అన్నారు ముగ్గురు. నాలుగో వాడు చిన్నగా నవ్వాడు.

'నేను పక్కన ఉండగా రాజుగారి పై హఠాత్తుగా పులి దూకడం జరగదు. ఆయన విశ్రాంతి తీసుకుంటుండగా నేను చుట్టూ చూస్తూ కాపలా కాస్తుంటాను కదా!' అన్నాడు. నాలుగో వాడికి ఆ పదవి దక్కింది.

**రక్షణ రంగంలో ఉన్నవారు చురుకుగా ఉండాలి**

## వైద్యం

ధనికుడు ఒకడు వైద్యుడి దగ్గరికి వెళ్ళాడు. 'కడుపు నొప్పి భరించలేక పోతున్నాను. మందు ఇవ్వండి' అన్నాడు. 'ఉదయం ఏం తిన్నారు?' అడిగాడు వైద్యుడు. 'నాలుగు రొట్టెలు తిన్నాను. అవి బాగా కాలి ఉండవు' అన్నాడు ధనికుడు. వైద్యుడు చిన్న సీసాతో మందు ఇచ్చాడు. 'ఈ మందు మూడు పూటలా రెండేసి చుక్కలు కళ్లలో వేసుకోండి' అన్నాడు.

'ఇదేం వైద్యం? కడుపు నొప్పి అంటే కంటికి మందు ఇచ్చారేమిటి?' అన్నాడు ధనికుడు. 'మీ కంటి చూపులో లోపం ఉండ బట్టే కదా కాలీ కాలని రొట్టెలు తిన్నారు. ముందు చికిత్స మీ కళ్ళకు అవసరం' అన్నాడు వైద్యుడు.

**రోగం మూలం తెలుసుకుని వైద్యం చేయాలి**



## ఆస్తి పాస్తులు




ఒక జమీందారు కూతురికి పెళ్లి వయసు వచ్చింది. ఆమెను పెళ్ళాడటానికి పక్క ఊరు నుంచి మరో ధనికుడు కొడుకుని వెంట బెట్టుకు వచ్చాడు. 'అయ్యా! నా కొడుకు మీ అమ్మాయికి అన్ని విధాలా తగినవాడు. మా ఆస్తి పాస్తులు మీ కంటే ఎక్కువే!' అన్నాడు ధనికుడు. అతడు ఎక్కువ గొప్పలు చెపుతున్నట్లు అనిపించింది అమ్మాయి తండ్రికి. 'మీ ఇంట్లో ఎలుకలు, పిల్లులు, కుక్కలు ఉన్నాయా?' అడిగాడు జమీందారు. 'అలాంటివి మా ఇంట్లో లేనే లేవు!' అన్నాడు చిరాగ్గా ధనికుడు. 'మీ సంబంధం మాకు ఇష్టం లేదు' అని చెప్పి వారిని పంపేశాడు జమీందారు. భార్య అడిగింది ' పెళ్ళి మాటల్లో ఎలుకలు, పిల్లులు, కుక్కలూ సంగతి ఎందుకు?' అని. 'ధాన్యమున్న చోట ఎలుకలు, పాడి పశువులున్న చోట పిల్లులు ఉంటాయి. ఆస్తి పరుడు తప్పకుండా కాపలా కుక్కలను పెంచుకుంటాడు. వాళ్ళ ఇంట్లో ఇవన్నీ లేవంటే వాళ్ళ ఆస్తిపాస్తులు ఏపాటివో అర్థమయింది.' అన్నాడు జమీందారు.

**పెళ్లికి ముందు అన్ని వివరాలు ఆరా తీయాలి**

## చదువు మంత్రం

చదువు కోసం గురుకులంలో చేరాడు చిన్నయ్య. తెల్లవారు జామున అయిదు గంటలకి లేచి పాఠాలు వల్లె వేయాలంటే అతడికి పరమ బద్ధకం. అలా పన్నెండేళ్ళు చదవాలి. అది చిన్నయ్యకి నచ్చలేదు. వెంటనే ఒక స్వామీజీని కలిశాడు. 'స్వామీ! సులభంగా చదువు వచ్చే మంత్రం చెప్పండి' అన్నాడు చిన్నయ్య. స్వామీజీ చిరునవ్వు నవ్వాడు. 'దానికేం భాగ్యం. ప్రతిరోజూ తెల్లవారు జామున నాలుగు గంటలకు లేవాలి. చన్నీటి స్నానం చేయాలి. ఆ మంత్రం చదవాలి. అలా పద్నాలుగేళ్ళు చేస్తే సరస్వతీ ప్రసన్నం అవుతుంది. వెళ్ళి స్నానం చేసిరా! మంత్రం ఉప దేశిస్తాను' అన్నాడు స్వామీజీ. చిన్నయ్య బెదిరి పోయాడు. 'మంత్రం వద్దు స్వామి.మామూలు పద్ధతిలోనే విద్య నేర్చుకుంటాను' అన్నాడు చిన్నయ్య.

**చదువు నేర్వటానికి దగ్గరి దారులు ఉండవు**





## మీసాలు

హాయిగా నిద్ర పోతున్న రాజు గారికి గడ్డం చేస్తున్నాడు తిప్పడు. పొరపాటున ఆయన మీసం ఒక వైపు గీసి పారేశాడు. రాజు గారు అది గమనిస్తే తన ప్రాణాలు తీస్తారని భయపడ్డాడు. ఒక ఉపాయం తట్టింది. 'ప్రభూ! ఎంత రాజయినా, చక్రవర్తి అయినా ఏదో ఒక బలహీనత ఉంటుంది. మీరూ అంతేగా!' అన్నాడు. 'నేను ఎలాంటి బలహీనత నుంచి అయినా బయట పడగలను.' అన్నాడు రాజు. 'ప్రభూ! మీరు తరచుగా మీసాలు మెలి వేస్తారు. అవి లేక పోయినా ఆ అలవాటు పోదు కదా!' అన్నాడు తిప్పడు. రాజుకి అహం దెబ్బతిన్నది. 'నీవు అనేది నేను ఒప్పుకోను. కావాలంటే మీసాలు తీసేయ్' అన్నాడు రాజు. 'బతుకు జీవుడా!' అనుకుంటూ రాజు మీసాలు గొరిగేశాడు తిప్పడు. ఒక్క నిముషం తర్వాత తిప్పడు అన్నట్టుగానే రాజు మీసాలు మెలి వేయబోయి ఫక్కున నవ్వాడు. తిప్పడు మెల్లగా అక్కడి నుండి జారుకున్నాడు.

**సమయస్ఫూర్తి ఉంటే సమస్య నుండి బయట పడవచ్చు**


## సంపద రహస్యం

రాజయ్య తక్కువ కాలంలోనే ధనికుడు అయ్యాడు. 'ఆ విషయం తెలుసుకుందామని ఒక యువకుడు ఆయన ఇంటికి వెళ్ళాడు. అతడి సంపద రహస్యం చెప్పమన్నాడు. 'అదేమంత భాగ్యం చెప్తాను. ఒక్క నిముషం ఆగండి!' అన్నాడు. గబగబా వెళ్ళి దీపం బుడ్డి ఆర్పి వచ్చాడు. యువకుడి పక్కన కూర్చున్నాడు. 'వెలుగుతున్న దీపం ఆర్పేశారు ఎందుకు?' అని యువకుడు అడిగాడు. 'మనం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకోవడానికి ఆ దీపం బుడ్డి లోని చమురు ఖర్చు చేయాలా?' అన్నాడు ధనికుడు. 'సరే... నేను బయలు దేరతాను' అంటూ పైకి లేచాడు యువకుడు 'సంపద రహస్యం తెలుసుకోవాలని వచ్చావు కదూ?' అన్నాడు ధనికుడు. 'ఆ రహస్యం మీ నోటి వెంట వినకుండానే నేను తెలుసు కున్నానులెండి' అంటూ యువకుడు ఇంటి దారి పట్టాడు.

**పొదుపు చేయటమే సంపద రహస్యం**



# పదవి



ఒక రాజ్యంలో కోశాధికారికి వయసు మీద పడింది. మంచాన పడ్డాడు. కొత్త కోశాధికారి పదవికి పది మంచి పోటీ పడ్డారు. వారిలో నీతి మంతుడిని ఎంపిక చేయాలి. ఆ బాధ్యత మంత్రి పై పడింది. మంత్రి ఆ పది మందిని చీకటి గది గుండా రాజు దగ్గరికి రమ్మన్నాడు. వాళ్ళు అలాగే వచ్చారు. 'గెంతులు వేస్తూ నా చుట్టూ వేగంగా పదిసార్లు ప్రదక్షిణ చేయండి' అని మంత్రి వారితో అన్నాడు. ఒక్కడు తప్ప మిగతా తొమ్మిది మంది గెంతులు వేయడానికి ఒప్పుకో లేదు. 'ప్రభూ! వీళ్ళు నడిచి వచ్చిన చీకటి గదిలో రెండు చోట్ల మెరిసే వెండి నాణేలు కుప్పగా పోయించాను. ఈ తొమ్మిది మంది వెండి నాణేలను దుస్తుల్లో దాచుకున్నారు. గెంతులు వేసేటపుడు వాటి శబ్దం వినపడుతుంది. తమ దొంగతనం బయట పడుతుంది. ఆ భయంతో ప్రదక్షిణలు చేయడానికి నిరాకరించారు. ఈ ఒక్కడు మాత్రం నీతి మంతుడు.' అన్నాడు మంత్రి. అతడిని కోశాధికారి పదవిలో నియమించాడు రాజు.

**నీతి లేనివారు కోశాధికారిగా పనికిరారు**

# డబ్బు చచ్చింది

ఒక వడ్డీ వ్యాపారి ఉన్నాడు. అతడు అమాయకులను మోసం చేసి డబ్బు సంపాదించే వాడు. ఆ వడ్డీ వ్యాపారి దగ్గరికి ఒకడు వచ్చాడు. నగ తాకట్టు పెట్టాడు. వెయ్యి రూపాయలు అప్పు తీసుకున్నాడు. నాలుగు రోజుల తరువాత వచ్చాడు. డబ్బు ఇచ్చేశాడు. వడ్డీ వ్యాపారి డబ్బు లెక్క చూసుకున్నాడు. 'రెండు వందలు ఎక్కువగా ఉంది. తీసుకో!' అని తిరిగి ఇవ్వబోయాడు వడ్డీ వ్యాపారి. 'అది మీ డబ్బే. అదేమన్నా పిల్లల్ని పెట్టిందేమో!' అన్నాడు అప్పు తీసుకున్న వాడు. వడ్డీ వ్యాపారి మారు మాట్లాడకుండా డబ్బు పుచ్చుకున్నాడు. నగను తిరిగి ఇచ్చేశాడు. నెల తరువాత అతడే మళ్ళీ వచ్చాడు. కూతురు పెళ్ళి కోసం లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాడు వడ్డీ వ్యాపారి దగ్గర. ఆరు మాసాలు గడిచాయి. అయినా డబ్బు తిరిగి ఇవ్వలేదు. వడ్డీ వ్యాసారి అతడిని పిలిచి అడిగాడు. 'నా కూతురు పెళ్ళి అయ్యేలోగా మీరు ఇచ్చిన డబ్బు కాస్తా చచ్చి ఊరుకుంది. దహనం కూడా చేశాను' అన్నాడు. వడ్డీ వ్యాపారికి వళ్ళు మండింది. 'డబ్బు ఎక్కడన్నా చస్తుందా? మోసం!' అని అరిచాడు. 'అయ్యా! పిల్లల్ని పెట్టేది ప్రతిదీ చస్తుంది. ఎవరినైనా అడగండి' అన్నాడు వాడు. వడ్డీ వ్యాపారి గతుక్కుమన్నాడు.

**మోసానికి మోసమే విరుగుడు**



## అపార్థం



'ఎలాంటి వారికి వైద్యం చేయడం కష్టం గురుదేవా?' అని అడిగాడు శిష్యుడు వైద్యుడిని. 'మూర్ఖుడికీ, అమాయకుడికీ వైద్యం చేయడం కష్టం. మనం చెప్పే దాన్ని వాళ్ళు వేరే విధంగా అర్థం చేసుకుంటారు' అన్నాడు గురువైద్యుడు. అంతలో అక్కడికి ఒళ్ళంతా కురుపులతో ఒక వ్యక్తి వచ్చాడు. 'అయ్యా! పోయిన ఏడాది నాకు జలుబుకి మందు ఇచ్చారు. ఇస్తూ స్నానం చేయవద్దన్నారు. అప్పటి నుంచి స్నానం చేస్తే జలుబు వస్తుందని స్నానం మానేశాను. జలుబు తగ్గింది. ఈ సారి ఈ చీడ కురుపులు తగ్గేందుకు మందు ఇవ్వండి' అన్నాడు. మందు ఇచ్చి వాడిని పంపేశాడు వైద్యుడు.'చూశావా? నేను అతడిని స్నానం చేయవద్దన్నది జలుబు తగ్గేంత వరకు మాత్రమే. ఏనాడూ స్నానం చేయకూడదని అతడు అర్థం చేసుకున్నాడు. ఇలాంటి వాళ్ళ విషయంలోనే జాగ్రత్త పడాలి !'
అని శిష్యుడికి వివరించాడు వైద్యుడు.

**రోగిని బట్టి వైద్యం చేయాలి**

## వృత్తి ధర్మం

పేదలకు ఉచిత వైద్యం చేసే వైద్యుడు ఉన్నాడు. అతడి దగ్గరికి ఒక అర్ధరాత్రి పూట ఇద్దరు మనుషులు వచ్చారు. వారిలో యువకుడిది పక్కగ్రామం. అతడి చెల్లెలు కడుపు నొప్పితో బాధ పడుతోంది. ముసలి వాడిది మాత్రం ఆ ఊరే. అతడి మనవరాలికి విషజ్వరం. 'నేను వైద్యం చేస్తే మీలో ఎవరు ఎక్కువ డబ్బు ఇవ్వగలరు?' అన్నాడు వైద్యుడు. 'మీరు ఎంత అడిగితే అంత ఇస్తాను' అన్నాడు యువకుడు. ముసలివాడు మాట్లాడలేదు. 'పక్క వీధిలో మంచి వైద్యుడు ఉన్నాడు. అతడు డబ్బు పుచ్చుకోకుండా వైద్యం చేయడు. ఆయన్ను మీ గ్రామానికి తీసుకుపో. ఈ పేదవాడింటికి ఆ వైద్యుడు వెళ్ళక పోవచ్చు.' అని యువకుడితో చెప్పాడు. ముసలి వాడి వెంట బయలుదేరాడు వైద్యుడు.



**సేవాభావంతో పాటు విచక్షణ కూడా ఉండాలి**






## దొరికిన దొంగ

దేశంలో దోపిడీలు, హత్యలు చాలా జరుగుతున్నాయి. అవి చేసే గజదొంగను పట్టిస్తే వెయ్యి వరహాలు బహుమతి ప్రకటించాడు రాజు. ఆ ఊరి రైతు రామయ్య పొలం నుంచి వస్తూ దొంగను పట్టుకుని కట్టేశాడు. రాజుగారి దగ్గరకు దొంగను తీసుకు వెళుతున్నాడు. దారిలో వీరయ్య కలిశాడు.  విషయం తెలుసుకున్నాడు. అంతే, వీరయ్య పెద్ద కర్రతో రామయ్య నెత్తిన మోదాడు. రామయ్య పడిపోయాడు. దొంగను తన వెంట రాజుగారి దగ్గరికి తీసుకెళ్ళాడు వీరయ్య.  స్పృహ తప్పిన రామయ్యకు  మెలకువ వచ్చింది. వీరయ్య వెనకనే వెళ్ళాడు. 'దొంగను నేను పట్టుకున్నానంటే. నేను పట్టుకున్నానని వారు వాదులాడ సాగారు. రాజు మంత్రికి కనుసైగ చేశాడు. 'మహారాజా! వీడు దొంగ కాదు. మన విదూషకుడి కొడుకు.' అని అరిచాడు మంత్రి. వీరయ్య గతుక్కుమన్నాడు. 'దొంగను పట్టుకున్నది నేను కాదు. రామయ్యే!' అన్నాడు వీరయ్య. అబద్ధం బయట పడింది. రాజు వీరయ్యకు పాతిక కొరడా దెబ్బలు కొట్టించాడు. రామయ్యకు వెయ్యి వరహాలు ఇచ్చి పంపాడు.

**తీర్పు చెప్పాలంటే తెలివి కూడా ఉండాలి**







## చికిత్స

ఒక రాజు గారికి  అంతు చిక్కని రోగం వచ్చింది. 'తగ్గించిన వారికి లక్ష వరహాలు బహుమతి. తగ్గించలేక పోతే శిరచ్ఛేదనం.' అని ప్రకటించాడు రాజు. చాలా మంది వైద్యులు వచ్చి తగ్గించలేక ప్రాణాలు పోగొట్టు కున్నారు. చివరికి ఒక వైద్యుడు వచ్చాడు. 'ప్రభూ! మీ వ్యాధిని తగ్గించ లేకపోతే నాకు శిరచ్ఛేదం. తగ్గిస్తే మీకు శిరచ్ఛేదం. ఒప్పుకుంటారా?' అన్నాడు. 'రోగం కుదిరాక నేనెందుకు చావాలి?' అన్నాడు రాజు కోపంగా. 'రోగం కుదర్చక పోతే నా తల తీస్తారు. కుదిర్చితే మీ తల నేనెందుకు కోరకూడదు?' అన్నాడు వైద్యుడు. అతని ప్రశ్నలోని ఆంతర్యం తెలిసి రాజు శిరచ్ఛేదం ప్రకటనను రద్దు చేశాడు. వైద్యుడు చికిత్స చేసి రాజు గారి రోగం నయం చేశాడు. రాజు నుండి కానుకలు అందుకున్నాడు.

**నిబంధనలు న్యాయ సమ్మతంగా ఉండాలి**







## తిక్క కుదిరింది


ఒక ఊరి రామాలయంలో గాన కచేరి పెట్టారు. యువగాయకుడు గోవిందును, మృదంగ విద్వాంసుడు మాధవయ్యను పిలిచారు. ఇద్దరికీ చెరో అయిదు వేల రూపాయలు ఇవ్వాలని అనుకున్నారు. ఆ విషయం తెలిసి మాధవయ్య నిర్వాహకులను కలిశాడు. 'అయ్యా! పాటలు పాడే ఆ కుర్రవాడూ, నేనూ ఒకటా? అతడి కన్నా నా గొప్పదనం నలుగురికీ తెలిసేలా ఒక్క రూపాయి అధికంగా ఇవ్వండి' అన్నాడు మాధవయ్య. అతడి మాటల్లో కొంచెం గర్వం ధ్వనించింది. నిర్వాహకులు ఒప్పుకున్నారు. కార్యక్రమం ముగిసింది. 'మహాజనులారా? గోవిందుకు ఇచ్చే పారితోషికం కన్నా ఒక్క రూపాయి అధికంగా కావాలన్నారు మాధవయ్య గారు. ఇది దైవకార్యం కనుక తనకు పారితోషికం వద్దన్నారు గోవిందు. అందువల్ల మాధవయ్య గారికి ఒక్క రూపాయి ఇస్తున్నాం.' అని నిర్వాహకులు ప్రకటించారు. మాధవయ్య గతుక్కుమన్నాడు.

**గర్వం చేటు తెస్తుంది**

## అంజనం

సోమయ్య గొప్ప జ్యోతిషుడు. పోయిన వస్తువులు ఎక్కడ దొరుకుతాయో అంజనం వేసి చెప్పగల దిట్ట. ఒకసారి సోమయ్య పొరుగూరు వెళ్ళి తిరిగి వస్తున్నాడు. దారిలో ఒక సత్రంలో విడిది చేసి పడుకున్నాడు. అక్కడ తన గొడుగును పోగొట్టుకున్నాడు. ఆ గ్రామాధికారికి ఫిర్యాదు చేశాడు సోమయ్య. 'అయ్యా! గొడుగు ఎక్కడ ఉందో మీరు తేలిగ్గా చెప్పగలరు కదా. అంజనం వేసి చూడండి.' జ్యోతిషుడితో అన్నాడు గ్రామాధికారి. 'అలాగే చేద్దును. కాని అంజనం వేసినందుకు వంద రూపాయలు తీసుకుంటాను. మీరు ఆ వంద ఇస్తానంటే ఇప్పుడే అంజనం వేస్తాను!' అన్నాడు సోమయ్య చిరాగ్గా. 'తన వస్తువుకి కూడా అంజనం ముడుపు మేము చెల్లించాలా?' అని గ్రామాధికారికి మతి పోయినంత పని అయింది.

**పిసినారి తనానికి పరిమితులు ఉండవు**



## ధర్మ గంట



ధర్మసేన మహారాజు కోట ముందు ధర్మ గంట ఏర్పాటు చేశాడు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఆ గంటను మోగించ వచ్చు. పదేళ్ళ క్రితం హిమాలయాలకు వెళ్ళిన రాజ గురువు తిరిగి వచ్చాడు. పాలన ఎలా సాగుతున్నది గురువు గారికి రాజు చెపుతున్నాడు. అంతలో ఒక సేవకుడు వచ్చాడు. 'ప్రభూ! ధర్మ గంట బాగా అరిగి పోయింది. ధ్వని సరిగా రావటం లేదు. మరో గంటను చేయించాలి'. అన్నాడు. 'ఆరు నెలల కిందటే కదా కొత్త గంట చేయించాం. అప్పుడే అరిగి పోయిందా? ఈ సారి కంచు లోహంతో పెద్ద గంట చేయించు'. అన్నాడు ధర్మ సేనుడు. రాజగురువు నవ్వి 'రాజా! ఇప్పుడు కావలసింది మరొక ధర్మ గంట కాదు. ధర్మం! ధర్మ గంట మోగించటానికి అది అరిగి పోయేంత మంది వస్తున్నారంటే దేశంలో అధర్మం పెచ్చుమీరిందనేగా అర్థం'. అన్నాడు. రాజుకి తన పాలనలోని లోపం తెలిసింది.



**ధర్మ గంట కంటే ధర్మం ముఖ్యం**


## సాధువు

ఒక రాజు వేటకు అడవికి వెళ్ళాడు. దారిలో ఒక ఆశ్రమంలో తన ఆభరణాలను భద్ర పరిచాడు. అది తెలిసి ఇద్దరు దొంగలు సాధువు ఉండే కుటీరంలో దూరారు. సాధువు వారిని గమనించాడు."బాబూ! ఆ ఆభరణాలు పట్టుకు పోండి!' అన్నాడు సాధువు. 'అదేమిటి స్వామీ!'అని బిత్తరపోయారు దొంగలు. 'దొంగతనం పాపం మీకు అంటకుండా నేనే నగలు ఇచ్చేస్తున్నాను. నగలు మీరు దొంగిలించి పట్టుబడితే రాజుగారు మీ తలలు తీస్తారు. అందుకే, రాజు గారితో ఈ నగలు నేనే మీకు ఇచ్చినట్టు చెపుతాను.'అన్నాడు సాధువు. దొంగలు సాధువును వింతగా చూశారు. నగలు అక్కడే వదిలేసి తమ దారిన పోయారు.

**సాధు స్వభావం లోక రంజకం**







## అర్హత

ఒక రాజుకి ముగ్గురు కొడుకులు. వారికి తలొక లక్ష వరహాలు ఇచ్చాడు రాజు. 'ఆరు మాసాలలో ఈ ధనంతో ఎవరు ఎక్కువ సామర్థ్యం ప్రదర్శిస్తారో, వారికి రాజ్యాభిషేకం' అన్నాడు రాజు. ఆరు నెలలు గడిచాయి. 'నా డబ్బుతో విలువైన ధర్మశాస్త్ర గ్రంథాలు ప్రచురించి ప్రజలకు ఉచితంగా పంచుతున్నాను' అన్నాడు పెద్ద వాడు. 'వాన కురిసే ప్రక్రియ నేర్చుకున్నాను. మన దేశానికి నీటి కరువు లేకుండా చేస్తాను'. అన్నాడు రెండో వాడు. 'నా డబ్బుతో సేనాధిపతులను, దళాధిపతులను కొనేసి నా పక్షం చేసుకున్నాను. ఈ భవనాన్ని నా సేనలు చుట్టు ముట్టాయి. నాకు వెంటనే రాజ్యాభిషేకం చేయండి.' అన్నాడు మూడోవాడు. ఆ రోజే వాడికి రాజ్యాభిషేకం జరిగింది.

**రాజతంత్రం తెలియటమే సరైన సమర్థత**





## విమర్శ

ఒక రాజుగారికి కళలంటే ఇష్టం. ఒకసారి జీవకళ ఉట్టి పడే బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేశాడు. పక్షుల్లా, జంతువుల్లా ఉన్న బొమ్మలను చూసి, అవి సహజంగా లేవంటూ ఒకడు విమర్శించాడు. చివరికి ఒక మామిడి చెట్టు కొమ్మన రెండు చిలకలను చూసి ఆ విమర్శకుడు పెదవి విరిచాడు. 'ఏమిటిది? చిలక ముక్కులు ఇలాగా ఉండేది? బొమ్మలు చేసిన వాడికి రంగులు కలపడం రాదు. చిలకలకి అవేం రెక్కలు? అవేం కళ్ళు?' అని వెటకారంగా అన్నాడు. అంతలో ఆ రెండు చిలకల్లోంచి ఒకటి టపటపమంటూ రెక్కలాడిస్తూ ఎగిరిపోయింది. దాని రెక్కలు తగిలి బొమ్మ చిలక కొమ్మ మీద నుంచి దభీమని కిందపడి ముక్కలు అయింది. విమర్శకుడు బిత్తర పోయాడు. అర్థం లేని విమర్శ చేసిన అతడిని చూసి జనం ఫక్కున నవ్వారు.

**విమర్శ జనం మెచ్చేదిగా ఉండాలి**





## పరీక్ష

ఒక రాజు గారు గ్రామాధికారి పదవి ఎంపికకు పోటీ పెట్టారు. అభ్యర్థులు ముందుగా ఖజానాదారును కలవమని చాటింపు వేయించారు. పది మంది వచ్చారు. వారిలో ఖజానాదారు చూసిన రాజశేఖరుడనే వాడిని గ్రామాధికారి పదవిలో నియమిస్తున్నట్టు ప్రకటించాడు రాజు. ఆ వెంటనే మిగతా తొమ్మిది మంది రాజును కలిశారు. 'అయ్యా! ఇది అన్యాయం. మాకు ఈ ఉద్యోగం ఇప్పిస్తానని ఖజానాదారు తలా ఒక వెయ్యి వరహాలు లంచం అడిగితే ఇచ్చాం' అన్నారు. 'ఆ పరీక్ష పెట్టింది నేనే. లంచాలిచ్చి పదవిని సంపాదించాలనుకున్నారు మీరు. రేపు ఆ పదవిలో లంచాలు పుచ్చుకోరన్న నమ్మకం ఏమిటి? మీలో నిజాయితీ లేదు. రాజశేఖరుడు లంచం ఇవ్వడానికి నిరాకరించాడు. మా పరీక్షలో గెలిచాడు. పదవి సంపాదించాడు' అన్నాడు రాజు.

**బాధ్యత గల పదవికి నిజాయితీ ముఖ్యం**



## తెలివి అమ్మకం

రాజుగారు సభ తీర్చి ఉన్నారు. ఆయనకు ఒక సందేహం వచ్చింది. బజారులో అన్ని వస్తువుల లాగే తెలివి కూడా కొనేందుకు దొరికితే అప్పుడెలా ఉంటుంది?' అని రాజు గారు అడిగారు. 'దేశంలోని మూర్ఖులంతా ఎగబడి కొంటారు. ఇక దేశంలో మూర్ఖుడే ఉండడు' అన్నాడొక సభికుడు. విదూషకుడు లేచాడు. 'ప్రభూ! అది అసంభవం. తెలివి అమ్మకానికి దొరికినా ప్రతి వ్యాపారీ లాభాల కోసం తెలివి పేరు చెప్పి మరేదో అమ్ముతాడు. అది పని చేయక మూర్ఖులు మూర్ఖులు గానే ఉండిపోతారు.' అన్నాడు. 'కొనేవాళ్ళు తాము కొంటున్నది తెలివో కాదో తెలుసుకో లేరా?' అన్నాడు మరొక సభికుడు. 'తెలుసుకోలేరు. తెలివిని కొనేందుకు వచ్చి వాళ్ళంతా మూర్ఖులే కదా !' అన్నాడు విదుషకుడు. అందరూ గొల్లున నవ్వారు. రాజుగారు విదూషకుడిని అభినందించి బహుమతులు ఇచ్చారు.

**తెలివి గురించి చెప్పటానికి తెలివి ఉండాలి**



## ఎంపిక



ఒక దేశపు మంత్రి వృద్ధుడయ్యాడు. ఆ పదవికి కొత్త మంత్రిని ఎంపిక చేయమని మంత్రికి చెప్పాడు రాజు. చాలా మంది వచ్చారు. వడపోత తరువాత ఇద్దరు మిగిలారు. 'ఇది మీకు చివరి పరీక్ష. దీనిలో గెలిచిన వారికి మంత్రి పదవి దక్కుతుంది. మీ ఇద్దరిలో అన్నీ తెలిసిన వాడిననే గట్టి నమ్మకం ఉన్నవాడు పోయి, రాజుగారి ఆసనంలో కూర్చోండి. ఇందుకు వ్యవధి మూడు క్షణాలు మాత్రమే!' అన్నాడు వృద్ధ మంత్రి. వారిలో ఒకడు వెంటనే వెళ్ళి రాజు గారి ఆసనం మీద కూర్చున్నాడు. వృద్ధ మంత్రి రెండోవాడిని మంత్రి పదవికి ఎంపిక చేశాడు. 'రాజుగారి ఆసనం మీద కూర్చో కూడదని తెలియని వాడు ఈ పదవికి అర్హుడు కాదు ప్రభూ! అందుకే రెండోవాడిని ఎంపిక చేశాను.' అన్నాడు వృద్ధ మంత్రి.




**మంత్రి పదవికి ఇంగిత జ్ఞానం అవసరం**

## లంచం

శత్రువుల బెడద నుంచి కోటను కాపాడాలి. అందుకోసం రాజుగారు నగరం చుట్టూ కొండరాళ్ళతో ఎత్తయిన గోడ కట్టించాడు. బలమైన ఇనుప తలుపులు పెట్టించాడు. ఏనుగులతో కుమ్మించినా గోడ చెక్కు చెదర లేదు. రాజుకి తృప్తి కలిగింది. 'శత్రువులు నగరంలో కాలు మోప లేరు' అన్నాడు రాజు మంత్రితో. ఒకనాటి రాత్రి రాజు, మంత్రి మారు వేషాలలో నగర పరిసరాలలో తిరిగి ముఖద్వారం దగ్గరకు వచ్చారు. భటుల నాయకుడిని 'తలుపులు తెరువు' అన్నారు. 'సైన్యాధిపతి అనుమతి లేనిదే సూర్యాస్తమయం తరువాత ఎవరూ నగరంలోకి ప్రవేశించడానికి వీలులేదు' అన్నాడు కాపలావాడు . మంత్రి వాడిని పక్కకి తీసుకు వెళ్ళాడు. ఇరవై బంగారు నాణేలు వాడి చేతిలో పెట్టాడు. 'మాకు నగరంలో అవసరమైన పని ఉంది' అన్నాడు. భటుల నాయకుడు ద్వారాలు తెరవమని ఆదేశించాడు. తెరిచారు. 'ప్రభూ! ఏనుగుల బలం కన్నా, ఫిరంగుల కన్నా బలమైన దేమిటో తెలిసింది కదా!' అన్నాడు మంత్రి.

**లంచం ఎలాంటి వారినైనా లొంగదీస్తుంది**



# శని ప్రభావం



ఒకనాడు శని పరమ శివుడి దగ్గరికి వచ్చాడు. 'శివా! నేను అయిదు క్షణాల పాటు నిన్ను పట్టుకో బోతున్నాను' అన్నాడు. పరమశివుడు చిరునవ్వు నవ్వాడు.'శనీ! నన్ను పట్టుకోవడం నీ వల్ల కాదు'. అన్నాడు. శని వెళ్ళి పోయాడు. ఎందుకైనా మంచిదని శివుడు కైలాసం వదిలేసి అడవుల్లోకి వెళ్ళాడు. ఒక చిన్న పురుగు లాగ మారి ఒక చెట్టు తొర్రలో దాక్కున్నాడు. అయిదు క్షణాల తరువాత శివుడు చెట్టు తొర్రలో నుండి బయటికి వచ్చాడు. ఎదురుగా శని కనిపించాడు .శివుడు విజయ గర్వంతో నవ్వాడు. 'చూశావా శనీ! నేను నీకు దొరకలేదు!' అన్నాడు. శని ఫకాలున నవ్వాడు. 'పిచ్చి శివుడా! నేను నిన్ను పట్టుకోబట్టే కదా, వెండి కొండ వదిలి ఇలా చెట్టు తొర్రలో పురుగువై దాక్కున్నావు' అన్నాడు శని. శివుడు గతుక్కుమన్నాడు.

**శని ప్రభావం శివుడికీ తప్పలేదు**



# పిరికివాడు

నలుగురు స్నేహితులు ఉన్నారు. వారిలో ఒకడు పిరికివాడు. వాడితో మిగతా వారు ఒక పందెం వేశారు. 'అర్థరాత్రి పూట స్మశానానికి ఒంటరిగా వెళ్ళాలి. తిరిగి రాగలిగితే వెయ్యి రూపాయలు ఇస్తాం. అలా వెళ్ళలేక పోతే నువ్వే మాకు ఇవ్వాలి.' అన్నారు. ఒప్పందం ప్రకారం పిరికి వాడు అర్థరాత్రి పూట ఒంటరిగా స్మశానంలోకి వెళ్ళి ధైర్యంగా తిరిగి వచ్చాడు. స్నేహితులు ఆశ్చర్య పోయారు. 'అసలే  పిరికి వాడివి. ఒంటరిగా స్మశానానికి ఎలా వెళ్ళి వచ్చావ్?' అని అడిగారు. 'అసలే వెయ్యి రూపాయల పందెం. ఎలా వదులుతాను. నేను నిజంగా స్మశానానికి వెళ్ళి వచ్చానో లేదో తెలుసు కుందామని మీరు ముగ్గురూ కొంచెం వెనకగా నా వెంట వస్తారని నాకు తెలుసు. మీరు తోడుంటే అప్పుడు నాకెందుకు భయం?' అన్నాడు తెలివైన పిరికి వాడు.

**పిరికి వాడైనా తెలివి ఉంటే గెలుస్తాడు**







## శీలం లేని చోటు

ప్రహ్లాదుడు అనే రాజు ఉండేవాడు. అతడు ఉత్తముడిగా పేరు పొందాడు. ఒకసారి ఇంద్రుడు బిచ్చగాడి వేషంలో ఆ రాజు దగ్గరికి వచ్చాడు. 'నీ శీలాన్ని దానమివ్వు!' అని అడిగాడు. ఏమీ ఆలోచించకుండా రాజు తన శీలాన్ని దానమిచ్చాడు. అంతే, రాజులోంచి ఒక కాంతి పుంజం బయటికి వచ్చి బిచ్చగాడిలో దూరింది. 'ఎవరు నువ్వు?' అన్నాడు రాజు. 'నీ శీలాన్ని. దానమిచ్చావుగా వెళ్ళిపోతున్నా' అంది కాంతి పుంజం. కాసేపటికి మరో కాంతి పుంజం రాజు లోంచి బయటికి వచ్చింది. 'ఎవరు నువ్వు?' అన్నాడు రాజు. 'నీ శౌర్యాన్ని. శీలం లేని చోట నేను ఉండను' అంది. మరి కాసేపటికి మరో కాంతి పుంజం బయట కొచ్చింది. 'నువ్వు?' అడిగాడు రాజు. 'నీ రాజ్యలక్ష్మిని. శీలానికి సేవకురాలిని శీలాన్ని దానం ఇచ్చావు. శీలం లేని చోట నేనుండను. అంటూ ఆ కాంతి పుంజం బిచ్చగాడిలో దూరింది.

**శీలం పోతే అన్నీ పోతాయి.**


## అదంతే!

ఒక గురువు గారు ఆశ్రమంలో యజ్ఞం చేసేవారు. అక్కడ ఉండే నల్ల పిల్లి అటూ ఇటూ పరుగెత్తి గందరగోళం చేసేది. గురువు గారు ఒక తట్ట కింద పిల్లిని మూసి ఉంచి యజ్ఞం పూర్తి చేసేవారు. కొంత కాలానికి ఆ గురువు గారు మరణించారు.

ఆయన కొడుకు ఆశ్రమంలో యజ్ఞం చేసేటపుడు ఊరంతా తిరిగి కష్ట పడి ఒక నల్ల పిల్లిని కొనుక్కు వచ్చేవాడు. ఆశ్రమం మధ్యలో తట్ట కింద ఆ పిల్లిని మూసి పెట్టి యజ్ఞం పూర్తి చేసేవాడు. ఒకసారి ఎవరో అడిగారు ' ఏమిటిది?' అని. 'నల్ల పిల్లిని బుట్ట కింద మూసి పెట్టి యజ్ఞం చేయటం మా ఆచారం. మా తండ్రిగారూ ఇలానే చేసేవారు. అదే నేను అనుసరిస్తున్నాను' అని చెప్పాడు గురువుగారి కొడుకు.

**మూఢనమ్మకాల మూలాలు తెలుసుకోవాలి**






## వెతుక్కో!.

బ్రహ్మ మనిషిని తయారు చేశాడు. సర్వశక్తులు ఇచ్చాడు. 'వీడు దేవాంతకుడు అయి అందరినీ ఇబ్బంది పెడతాడేమోనని బ్రహ్మకి సందేహం కలిగింది. మనిషి బలాన్ని అతడికి తెలియకుండా దాచేయాలని అనుకున్నాడు. 'ఆకాశంలో దాచేద్దాం' అంది డేగ. 'వద్దు... మనిషి అక్కడికీ వస్తాడు' అన్నాడు బ్రహ్మ. 'నీటి అడుగున దాచేద్దాం' అంది చేప. 'వద్దోద్దు' అన్నాడు బ్రహ్మ. 'పోనీ, భూమి పొరల్లో దాచేద్దాం' అంది ఎలుక.

'అక్కడ కూడా వద్దు. మనిషి అసాధ్యుడు. అక్కడికీ వస్తాడు.' అన్నాడు బ్రహ్మ. 'అతడి సర్వశక్తులను మనిషిలోనే దాచేద్దాం'. అంది కోతి. 'భేష్! మనిషి అన్ని చోట్ల వెతుకుతాడు. అన్నిటినీ జయిస్తాడు. కాని, తన లోపలికి వెళ్ళలేడు. తనను తాను జయించ లేడు. కాబట్టి అక్కడే దాచేద్దాం' అన్నాడు బ్రహ్మ. ఆ నాటి నుండి సర్వశక్తులూ మనిషి లోపలే ఉన్నాయి. కాని, అది గ్రహించకుండా బయట వెతుకుతున్నాడు మనిషి.

**మనిషి శక్తిని మనిషి లోనే వెతకాలి**



## స్వభావం

చెరువు నీటిలో ఒక తేలు మునిగి పోతోంది, ఆ దారిన పోయే సాధువు చూశాడు. చెరువులోకి దిగాడు. తేలును చేతిలోకి తీసుకుని బయట వేయబోయాడు. చేతిని తేలు కుట్టింది. చేతిని విదిలించాడు. తేలు నీళ్ళలో పడింది. అలా నాలుగైదు సార్లు చేశాడు. చివరికి సాధువు తేలును ఒడ్డున పడేశాడు. అటుగా వెళుతున్న ఒక బాటసారి సాధువుతో అన్నాడు. 'ఏమిటి స్వామి మీకు తెలివి లేదా? తేలు కుడుతుందని తెలిసి కూడా కాపాడబోయారు. ఎందుకు?' అని. 'అయ్యా! అంత చిన్న ప్రాణి తన ప్రాణం పోయే సమయంలో కూడా తన సహజ లక్షణం వదల లేదు. అలాంటప్పుడు ఎదుటి వారికి సాయం చేసే నా సహజ లక్షణాన్ని నేనెలా వదులుకోగలను!' అన్నాడు సాధువు.

**కష్ట సుఖాల్లో సహజ స్వభావం వదులుకో కూడదు.**



## పరమ పిసినారులు



ఇద్దరు అన్నదమ్ములున్నారు. వారు పరమ పిసినారులు. ఒకనాడు తమ్ముడు పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది. తెల్లవారు జామునే లేచి బయలు దేరాడు. ఊరి పొలిమేరకు వెళ్ళగానే దీపం ఆర్పకుండా వచ్చినట్లు గుర్తొచ్చింది. అనవసరంగా కిరసనాయిలు ఖర్చు అవుతుందని బాధ కలిగింది. వెంటనే వెనుతిరిగి వచ్చాడు. తలుపు తట్టాడు. అన్న తలుపు తెరిచాడు.'తిరిగి వచ్చావేమిటి?' అని అన్న అడిగాడు. 'దీపం ఆర్పకుండా వెళ్ళాను. నూనె వృధా అవుతుందని తిరిగి వచ్చాను!' అన్నాడు తమ్ముడు. 'ఎంత పని చేశావురా ! నీవు వెళ్ళగానే దీపం ఆర్పేశాను. నీవు తిరిగి రావటం వల్ల అనవసరంగా నీ చెప్పులు అరిగిపోలేదా?' అని చిరాకు పడ్డాడు అన్న. 'అబ్బా!! ఆ మాత్రం నాకు తెలియదా? తిరిగి వచ్చే టప్పుడు చెప్పులు చేత్తో పట్టుకు వచ్చాను!' అన్నాడు తమ్ముడు.

**పిసినారితనంలో దొందు దొందే**

## పనిమంతుడు

ఒక చెప్పుల షాపు ఉంది. ఆ యజమాని వచ్చిన వారికి ప్రతి చెప్పుల జతను స్వయంగా కాలికి తొడిగి చూపు తున్నాడు. ఆ ఊరిలో ఆయనకి అలాంటి అయిదు షాపులున్నాయి. 'అయ్యా! మీరు పెద్దవారు మీరలా నా కాళ్ళు పట్టుకుని చెప్పులు తొడగడం నాకు చాలా ఇబ్బందిగా ఉంది. ఇలా ఇవ్వండి నేను వేసుకుంటాను' అన్నాడు ఒక కస్టమర్. చిరునవ్వు నవ్వాడు ఆ యజమాని.

'బాబూ! ఈ షాపులో చెప్పులు తొడిగి చూపించటం నా బాధ్యత. షాపు బయట మీరు కోటి రూపాయలు ఇచ్చినా నేను మీ కాళ్ళు పట్టుకోను. షాపులో ఉన్నపుడు మీరు కోటి రూపాయలు ఇచ్చినా మీ కాళ్ళు వదలను' అన్నాడు యజమాని.

**ప్రతివారూ వారు చేసే పనిని గౌరవించాలి**







# సహన పరీక్ష

ఒక దేవతా విగ్రహం ముందు ఒక మెట్టు ఉంది. అది ఒకసారి విగ్రహాన్ని అడిగింది. 'నేస్తం ! నీవూ నేనూ ఒకే కొండ నుండి వచ్చిన రాళ్లం. కాని, నిన్ను అందరూ మొక్కుతున్నారు. నన్ను తొక్కు తున్నారు. నేను చేసిన పాపం ఏమిటి?' అని. అప్పుడు విగ్రహం అంది - 'ఔను నేస్తం ! శిల్పి ఒకే కొండ నుండి మనల్ని తెచ్చాడు. మనం ఒకే తల్లి పిల్లలం. మొదట నిన్ను విగ్రహంగా మలచాలని శిల్పి నీ మీద ఉలిపెట్టి సుత్తితో కొట్టాడు. కాని, నీవు పెళుసుగా ఉండి, సుత్తి దెబ్బ తట్టుకోలేక పగిలి పోయావు. నిన్ను పక్కన పడేశాడు. శిల్పినా మీద ఉలి పెట్టాడు. సుత్తితో వందల, వేల దెబ్బలు వేశాడు. ఓపికగా భరించాను. విగ్రహంగా తయారయ్యాను. సహనం లేని నీవు రాయిగా ఉండి పోయి తొక్కబడుతున్నావు. ఓపికగా సుత్తి దెబ్బలు భరించిన నేను దేవతా విగ్రహంగా మారి మొక్క బడుతున్నాను.' అంది విగ్రహం.

**సహనం నీదైతే సకలం నీదేరా!**





# మొహమాటం

మురళి ఇంటి బెల్లు మోగింది. తలుపు తీశాడు. ఎదురుగా తన ప్రాణమిత్రుడు రాజా. రాజా లోపలికి వచ్చాడు. వెనుకనే కుక్క వచ్చింది. ప్రాణమిత్రులు ఇద్దరూ కాఫీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. ఆ కుక్క కాసేపు సోఫా మీద ఎక్కి గంతులేసింది. ఆ హాలుని కరాబు చేసింది. ఇద్దరూ మౌనంగా చూసి, తిరిగి సంభాషణలోకి జారుకున్నారు. ఆ కుక్క ఆగడాలు ఎక్కువయ్యాయి. ఇక ఉండబట్టలేక రాజా అన్నాడు. 'మురళీ! నీ కుక్కకి కాస్త శిక్షణ ఇప్పించకూడదా?' దానికి మురళీ ఆశ్చర్యపోయాడు. ' నా కుక్కా! నాకు అసలు కుక్కే లేదు. నీ వెనుకే లోపలికి వస్తే అది నీ కుక్క అనుకున్నాను. ఇంటిని పాడు చేస్తున్నా మొహమాటంతో ఏమీ అనలేక పోయాను.' అన్నాడు. మురళి వీధి కుక్కని బయటికి వెళ్ళ గొట్టాడు.

**మొహమాటం ఇబ్బందులు తెస్తుంది**



## చీమ చిటుక్కు



ఒకసారి చీమకి చిరు సందేహం కలిగింది. 'పాము కరిస్తే మనిషి చచ్చిపోతాడు. అందుకే మనిషికి పామంటే భయం. తేలు కుడితే బాధ పడతాడు. అందుకే తేలంటే భయం. చీమ కరిస్తే మాత్రం 'అష్టాల్ చీమ' అంటాడు. అందుకే మనిషికి నా తడాఖా చూపించాలి' అనుకుని చీమ బ్రహ్మ గురించి తపస్సు చేసింది. బ్రహ్మ ప్రత్యక్షం అయ్యాడు. 'చీమా! ఏమీ నీ కోరిక?' అన్నాడు బ్రహ్మ. బ్రహ్మను చూసిన ఆనందంలో చీమకి మాటలు తడబడ్డాయి. 'నేను మనిషిని కుట్టగానే మనిషి చావాలి' అని వరం అడగాలనుకుంది. అయితే చీమ 'స్వామి ! నేను మనిషిని కుట్టగానే చావాలి' అంది. 'తథాస్తు' అని బ్రహ్మ మాయమయ్యాడు. చీమ హుషారుగా, వరం పొందిన ఆనందంలో ముందుకు కదిలింది. ఒక మనిషి మీదకి పాకింది. చేతి మీదికి వెళ్ళింది. మనిషిని చిటుక్కున కుట్టింది. ఆ మనిషి పటుక్కున చీమ మీద ఒక దెబ్బ వేసి, నలిపి చంపేశాడు.

**భావ ప్రకటనలో స్పష్టత ఉండాలి**

## పరుగు



ఇద్దరు స్నేహితులు అడవిలో వెళ్తుంటారు. దూరంగా పెద్ద పులి వారి వైపు వస్తూ కనిపించింది. ఒకడు తన బూటు లేసులు బిగించుకున్నాడు పరుగెత్తే ప్రయత్నంతో- ఆశావాదంతో. రెండోవాడు నిరాశా వాదంతో నీరుగారి పోయాడు. 'పరుగెత్తి లాభం ఏముంది? ఎంతైనా దానంత వేగంగా పరుగెత్తలేం కదా!' అన్నాడు దిగులుగా.'పులి కంటే వేగంగా నేను పరుగెత్త లేక పోవచ్చు. కానీ, నీ కంటే రెండడుగులు ముందుంటే చాలు కదా! పులి నిన్ను మింగుతుంది. దాని ఆకలి తీరుతుంది. తిరిగి దానికి ఆకలి వేసే దాకా మరొకరి జోలికి పోదు. జంతువులలో ఆ నీతి ఉంది' అంటూ పరుగెత్తడం ప్రారంభించాడు మొదటి వాడు.

**ఆశావాదం గెలుపు దారులు తెరుస్తుంది**



## పదును పెట్టుకో!




కోటయ్య ఒక కాంట్రాక్టరు దగ్గర చెట్లు నరికే పని చేస్తున్నాడు. ఇటీవలే రాజారావు అనే అతన్ని పనిలో పెట్టుకున్నాడు యజమాని. రాజారావు మధ్య మధ్య పని ఆపేసి కూర్చునే వాడు. తను మాత్రం విరామం లేకుండా పని చేసేవాడు. అలాంటిది కొత్తగా వచ్చిన రాజారావుకి తన కంటే ఎక్కువ జీతం ఇవ్వడం కోటయ్యకి బాధ కలిగించింది. 'నా పనిని గుర్తించకుండా రాజారావుకి ఎక్కువ జీతం ఇచ్చారు. ఇది అన్యాయం.' అన్నాడు కోటయ్య."ఎక్కువ సమయం లెక్కకాదు. ఎక్కువ చెట్లు ఎవరు నరుకుతున్నారనేది ముఖ్యం' అన్నాడు యజమాని. రెండో రోజు రాజారావు ఎక్కువ చెట్లు నరుకుతున్నట్లుగా కోటయ్య గమనించాడు. 'నీకు ఇది ఎలా సాధ్యం?' అని రాజారావుని అడిగాడు కోటయ్య. 'నేను పని మధ్యలో ఆపి నా గొడ్డలిని పదును పెట్టు కుంటాను. అలా నాలుగైదు సార్లు చేస్తాను. నీ మొండి గొడ్డలిని రోజూ పదును పెట్టుకో. నా కంటే ఎక్కువ చెట్లు నరక గలవు !' అని చెప్పాడు రాజారావు.

నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పదును పెట్టుకోవాలి.

## అసలు విషయం

ప్రధానోపాధ్యాయుడు బడిలోని పది మంది పిల్లలకి ఒక పరీక్ష పెట్టాడు. వారందరికీ విత్తనాలు ఇచ్చాడు. 'వీటిని నాటి మొక్కలు చెయ్యండి. మూడు నెలల తరువాత తీసుకురండి. ఎవరి మొక్కలు బాగా పెరిగి పువ్వులు పూస్తాయో వారికి మంచి బహుమతి ఇస్తాను.' అన్నాడు. మూడు నెలల తరువాత పిల్లలంతా పూల మొక్కల తొట్టెలు తెచ్చారు. రకరకాల పూల మొక్కలు అందంగా ఉన్నాయి. ఒక పిల్లాడు మాత్రం ఖాళీ తొట్టె చూపించాడు. 'మీరిచ్చిన విత్తనం నాటాను. నీళ్ళు పోశాను. ఎన్ని రోజులైనా మొక్క రాలేదు. మీరు చెప్పిన పని చేయలేక పోయాను. క్షమించండి!' అన్నాడు. 'నీవు బహుమతిని గెలుచుకున్నావు. నేను అందరికీ ఉడక పెట్టిన విత్తనాలు ఇచ్చాను. అవి మొలవ్వు. కానీ, అందరూ వేరే విత్తనాలు అందులో వేసి పూల మొక్కలు మొలిపించి తెచ్చారు. నీవు నిజాయితీగా అసలు విషయం చెప్పావు.' అని బహుమతి ఇచ్చారు.


పిల్లలకి నిజాయితీ నేర్పాలి.



'కథా'కేళి

## యౌవన విభాగం

20 ఏళ్ళు వయసు పైబడిన వారికి





## పిల్లలు చూస్తే!...

ఒక యువకుడు ఒక ఖాళీ రోడ్డు దగ్గర సిగ్నల్ పడకుండా రోడ్డు దాట బోయాడు. పక్కనే ఉన్న పెద్దమనిషి అతడిని ఆపాడు.

'ఖాళీ రోడ్డే కదా! దాటితే ఏం?' అన్నాడు యువకుడు.

'పిల్లలు ఎవరైనా చూస్తారేమో!' అన్నాడు పెద్ద మనిషి.

'పోలీసులు చూస్తే ఇబ్బంది గానీ, పిల్లలు చూస్తే సమస్య ఏమిటి?' అర్థం గాక అడిగాడు యువకుడు.

'పోలీసులు చూస్తే నీకు క్రమశిక్షణ లేనందుకు జరిమానా వేస్తారు. కానీ, పిల్లలు చూస్తే వాళ్ళు నేర్చుకుంటారు. క్రమశిక్షణ తప్పి ఒక తరం పాడవుతుంది.' వివరించాడు పెద్ద మనిషి.

మనం చెప్పింది పిల్లలు చెయ్యరు.

మనం చేసిందే పిల్లలు చేస్తారు.

## భయం

ఒక గ్రామంలో చాలామంది ఏదో తెలియని రోగంతో మరణించారు. ఆ విషయం తెలిసి ఒక సాధువు అక్కడికి వెళ్ళాడు. బాధలో ఉన్న వారిని పరామర్శించి తిరిగి వస్తున్నాడు. గ్రామ సరిహద్దుల్లో అతనికి మృత్యు దేవత కనిపించింది. 'ఏం మృత్యు దేవతా !చాలా మందిని పొట్టన పెట్టు కున్నావు. వందల మందిని చంపటం న్యాయమా?' అన్నాడు సాధువు మృత్యు దేవతను మందలిస్తు.

'స్వామీ! నేను చంపింది పది మందినే. కానీ, మృత్యు భయంతో గుండె ఆగి చచ్చిన వాళ్ళు వంద మంది !' అంది మృత్యు దేవత.

భయం భయంకరమైనది





## సంతకం

ఒక కాలేజీ ప్రిన్సిపాల్‌కి చండశాసనుడని పేరుంది. ఆయనంటే విద్యార్థులకి సింహస్వప్నం. ఒకసారి ఆయనకు ఒక కవరు వచ్చింది. తెరిచి చూశాడు. ఒక కాగితం మీద 'గాడిద' అని రాసి ఉంది.

కడుపు మంట తీర్చుకోవడానికి ఎవరో విద్యార్థి రాసి పంపాడని అర్థం అయింది. మరునాడు ఉదయం అసెంబ్లీలో అందరి ఎదుట ఆ పేపరు చూపించారు ప్రిన్సిపాల్. 'నిన్న ఎవరో నాకు ఉత్తరం రాశారు. దానిలో విషయం ఏమీ రాయలేదు. కేవలం అతని సంతకం మాత్రమే 'గాడిద' అని ఉంది. దయచేసి ఆ గాడిద వచ్చి విషయం ఏమిటో చెపితే పరిశీలిస్తాను.' అన్నాడు ప్రిన్సిపాల్. చివరకు బాధ పడటం, సిగ్గుపడటం అది రాసిన ఆకతాయి విద్యార్థి పని అయింది.

**విమర్శలకు సంయమనంతో సమాధానం చెప్పాలి**



## బుర్రకి పదును

ఒక ప్రముఖ కార్ల కంపెనీ ఒక కొత్త రకం కారుని రహస్యంగా తయారు చేసింది. ఒక పెద్దగదిలో - ఏడాది పాటు కష్టపడగా కారు పూర్తయింది. తీరా దాన్ని బయటికి తేవాలంటే గది గుమ్మం కంటే కారు ఎత్తుగా ఉంది. అందరూ బుర్రలు బద్దలు కొట్టుకున్నారు.

గుమ్మం పగల గొట్టమన్నారు కొందరు. కారు పైభాగం తీసేయాలని కొందరు సలహా ఇచ్చారు. రెండూ అసాధ్యమే! అందరూ మళ్ళీ జుట్లు పీక్కున్నారు. ఇదంతా చూస్తున్న కాపలాదారు వచ్చి కారుకి నాలుగు చక్రాలలోని గాలిని తీసేశాడు. దాంతో కారుని ఎలాంటి ఇబ్బంది లేకుండా, ద్వారం గుండా బయటికి తెచ్చారు.

**బుర్రకి పదును పెడితే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది.**



## నాన్నా! తీసుకో





ఒక వ్యాపారవేత్తకి ఆరేళ్ళ పాప ఉంది. వ్యాపార వ్యవహారాల్లో పడి నెలల తరబడి కూతుర్ని పట్టించుకునే వాడు కాదు. ఒక రోజు ఇంటి కొచ్చిన తండ్రి గంట నుంచి ఫోనులో మాట్లాడుతున్నాడు. కూతురు ఎదురుగా వచ్చి నిల్చుంది. అయినా అతడు పాపను పట్టించుకో లేదు. 'నాన్నా! నీవు గంటకి ఎంత సంపాదిస్తావ్?' అంది పాప. 'వెయ్యి రూపాయలు !' అన్నాడు తండ్రి చిరాగ్గా. పాప పరుగున వెళ్ళి తన కిడ్డీ బ్యాంక్ తెచ్చింది. దానిలోంచి తను దాచుకున్న అయిదువందల రూపాయల చిల్లర తండ్రి ముందు పోసింది.'నాన్నా! ఈ అయిదు వందలు తీసుకుని నా కోసం అరగంట సమయం ఇవ్వు. ఈ వేళ నా పుట్టిన రోజు!' అంది దీనంగా చూస్తూ. తండ్రి గుండె జల్లుమంది. కూతురుని తను పట్టించుకోవటం లేదని అర్థం అయింది. వెంటనే పాపని గుండెలకు హత్తుకున్నాడు.

**తల్లిదండ్రులు పిల్లల కోసం సమయం వెచ్చించాలి.**

## 'బడి'గండం

దిగులుగా ఉన్న దానయ్యని కారణం ఏమిటని అతని స్నేహితుడు వివరం అడిగాడు. 'మా అబ్బాయి మూడు నెలల నుంచి స్కూలుకి వెళ్ళటం లేదు'. అన్నాడు దానయ్య.'నాలుగు తగిలించి పంపక పోయావా?" స్నేహితుడు సలహా ఇచ్చాడు. 'లాభం లేదు. మూడు నెలల కిందట వాడు తప్పి పోయాడు. నేను వాట్సప్ లో, ఫేస్ బుక్ లో వాడి ఫోటో పెట్టి నా అడ్రసు ఇచ్చాను. వాడు దొరికితే నాకు అప్పగించమని...' ' దొరికాడా?' 'పెట్టిన అరగంటలోనే దొరికాడు.' 'మరి ఇంకేమిటీ సమస్య?' ఆతృతగా అడిగాడు స్నేహితుడు. 'వాడు స్కూలుకి వెళ్తుంటే ఎవరో ఒకరు వాడిని బలవంతంగా పట్టుకొచ్చి ఇంట్లో అప్పజెపుతున్నారు. మూడు నెలల నుంచీ రోజూ ఇదే తంతు. జనాలు వాడిని బడికి వెళ్లనివ్వటం లేదు.' నిట్టూర్చాడు దానయ్య.

**సోషల్ మీడియా రెండు వైపులా పదునున్న కత్తి**







## అమాయకురాలు

గుడి మెట్ల మీద ఒక ముసలావిడ అడుక్కుంటోంది. ఆవిడను అడిగాను - 'నీ కొడుకు అమెరికాలో ఉన్నాడు కదా! నీకు డబ్బేమీ  పంపటం లేదా?' అని. 'అమెరికా వెళ్ళేటప్పుడు కొంత డబ్బు ఇచ్చాడు బాబూ!. అది నా ఖర్చులకి అయిపోయింది. అందుకే బతకటానికి బిచ్చమెత్తుకుంటున్నాను. అయితే ఆరు నెలల నుంచి ప్రతినెలా ఒక రంగు కాగితం పంపిస్తున్నాడు. నా కొడుకు గుర్తుగా వాటిని ఇంట్లో గోడకి అతికించు కుంటున్నాను.'అని చెప్పింది ఆమె.

ఆతృత ఆపుకోలేక ఆవిడ ఇంటికి వెళ్ళి చూశాను. ఇంట్లో గోడకి ఆరు చెక్కులు అతికించి ఉన్నాయి. ఒక్కొక్కటి యాభై వేల రూపాయలు.

**మాతృప్రేమలో అమాయకత్వం**

## బాధ

అబ్దుల్ కలాం బాల్యంలో సంగతి. ఒక రోజు వాళ్ళమ్మ మాడిన రొట్టెలు భర్తకు  పెట్టింది. 'రొట్టెలు మాడాయి క్షమించండి' అంది.

'ఇవి ఇలా తినడమే నాకు  ఇష్టం. చాలా బాగున్నాయి' అన్నాడు తండ్రి. తర్వాత కలాం తండ్రిని అడిగాడు. 'నాన్నా! మాడిన రొట్టెలు తినడం నీకు ఇష్టం లేదుగా! అమ్మతో  అబద్ధం ఎందుకు  చెప్పావు?' అని.

'మాడిన రొట్టె తింటే కలిగే హాని కంటే మీ అమ్మని తిడితే ఆమె పడే బాధ ఇంకా పెద్దది. ఎవరి మనసునీ ఎప్పుడూ నొప్పించ కూడదు' అన్నాడు కలాం తండ్రి.

**ఎదుటి వారి మనసును నొప్పించ కూడదు**








## విసుగు

డెబ్బయి ఏళ్ళ తండ్రిని పార్కుకి తీసుకెళ్ళాడు పావన మూర్తి . అక్కడ పిచ్చుక వాలింది. 'అదేమిటి నాన్నా?' తండ్రి అడిగాడు. పావన మూర్తి చెప్పాడు - 'పిచ్చుక' అని. తండ్రి మళ్ళీ అడిగాడు. కొడుకు చెప్పాడు. అలా అయిదారు సార్లు తండ్రి అడిగితే పావనమూర్తికి చిరాకు వేసింది. 'పిచ్చుక' అని చెప్పానుగా. పదిసార్లు అడుగుతావేం. నోరు మూసుకో!' అరిచాడు కొడుకు. కొంత కాలానికి తండ్రి చనిపోయాడు. తండ్రి డైరీలో ఒక పేజీలో ఇలా రాసి ఉంది.'నా కొడుక్కి రెండేళ్ళ వయసులో వచ్చీ రానిమాటలతో పిచ్చుకను చూపించి' అదేంటి నాన్నా?' అని నన్ను ఒకటికి పదిసార్లు అడిగితే ఆనందంగా చెప్పాను. కానీ ఈ రోజు అదే ప్రశ్న వాడిని నేను అడిగితే నా కొడుకు విసుక్కున్నాడు'

**పెద్దల మనసు తెలుసుకుని ప్రవర్తించాలి**





## తెలివి

ఒక ధనికుడు కొత్తగా విశ్రాంతి భవనం కట్టించాడు. దానికి రంగులు వేసేందుకు పెయింటర్ని పిలిచాడు. అతనికి ఒక చిన్న చెక్క పెట్టె ఇచ్చాడు -'ఈ పెట్టెకి ఉన్న గ్రే కలర్ లోనే గోడలు అన్నీ ఉండాలి. ఏ మాత్రం రంగులో తేడా వచ్చినా నీకు డబ్బులివ్వను' అన్నాడు. పని పూర్తయ్యాక ధనికుడు భార్యతో కలసి వచ్చాడు. పెయింటర్ కి ఇచ్చిన చెక్క పెట్టె తీసుకుని గోడల దగ్గర పెట్టాడు. రంగుని పోల్చి చూసుకున్నాడు. తృప్తి చెందాడు. అతనికి డబ్బు ఇచ్చి పంపేశాడు. 'చూశావా ! పెయింటర్ సరిగ్గా నేను చెప్పిన కలర్ షేడ్ నే వేశాడు' అన్నాడు. భార్య ఫకాలున నవ్వింది. 'ఆ పెయింటర్ చాలా తెలివిగలవాడు. షేడ్ లో తేడా రాకూడదనే గోడలకి వేసిన రంగు నే ఈ చెక్క పెట్టెకి వేసి మీకిచ్చాడు. ఆ పెట్టెనే పోల్చి చూసుకున్నారు. 'అంటూ ఆ చెక్క పెట్టెని గోరుతో రంగుని గీసి చూపింది.

**తెలివిగల వారికి సృజనాత్మకత ఎక్కువ**

## అర్థం చేసుకో



ఆరేళ్ళ చిన్నారికి ఆపిల్స్ ఇష్టం. వాళ్ళ నాన్న రెండు ఆపిల్స్ తెచ్చి ఇచ్చాడు. 'చిన్నారీ! నాకు ఒక ఆపిల్ ఇవ్వవా?' అడిగింది అక్క. 'రెండూ నాకే కావాలి. ఇవ్వను ఫో!' రాగాలు తీసింది చిన్నారి. కాసేపు అయ్యాక అమ్మమ్మ అడిగింది. 'చిట్టి తల్లీ! నాకొక ఆపిల్ ఇస్తావా?'అని. చిన్నారి దూరంగా పరుగెత్తింది. గబగబా రెండు ఆపిల్స్ కొంచెం కొంచెం కొరికేసింది. 'ఆపిల్స్ ఎంత ఇష్టమైతే మాత్రం... ఇవ్వడం ఇష్టం లేక అలా ఎంగిలి చేసేసింది' అనుకుంది అమ్మమ్మ. ఆమె మనస్సు చివుక్కుమంది. చిన్నారి అమ్మమ్మ దగ్గర కొచ్చింది. 'అమ్మామ్మా ! ఈ రెండు ఆపిల్స్‌లో ఇది చాలా తియ్యగా ఉంది. తీసుకో!' అంటూ ఒక ఆపిల్ ని అమ్మమ్మ కి ఇచ్చింది చిన్నారి. 'తీపి ఆపిల్ ఇవ్వడం కోసమే చిన్నారి అలా చేసిందని!' అర్థం చేసుకుంది అమ్మమ్మ.

**పిల్లల మనసులు స్వచ్ఛమైనవి**

## విలువ

భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగులు. బడికి వేసవి సెలవులు. అయిదేళ్ల పసి దాన్ని రోజూ ఆయాకు అప్పగించి వెళతారు. ఒక రోజు తల్లి హడావుడిగా బయలుదేరింది. 'అమ్మా! నగలన్నీ లాకర్లో పెట్టి తాళం వేశావా?' అడిగింది పాప. 'వేశాను చిట్టితల్లి' అంది అమ్మ. 'డబ్బులన్నీ బీరువాలో పెట్టి తాళం వేశావా?' 'వేశానమ్మా!' 'ఫ్రూట్స్, చాక్లెట్స్ ఫ్రిజ్ లో పెట్టి తాళం వేశావా? ' 'వేశాను బేబీ' 'ఆ తాళాలన్నీ ఆయాకి అప్పజెప్పావా?' 'అమ్మో! అవి ఆయాకి ఇవ్వకూడదు తల్లీ!!' 'ఎందుకమ్మా?' అంది పాప. 'అవి చాలా విలువైనవి. ఆయాకు అప్పజెప్ప కూడదు' అంది తల్లి.

'వాటి కంటే నేను విలువైన దాన్ని కాదా... అమ్మా? రోజూ నన్ను ఆయాకి అప్పజెప్పి పోతున్నావుగా?!' అంది పాప దిగులుగా.



**పిల్లలను విలువైన వారిగా చూడండి**

## బాహ్య సౌందర్యం





యాభై ఏళ్ళ తాయారు గుండెపోటుతో ఆసుపత్రిలో చేరింది. చావుకి దగ్గరగా వెళ్ళింది. దేవుడు కనిపించాడు. 'దేవుడా ! అప్పుడే నాకు నూరేళ్ళు నిండాయా?'అంది. 'నీకింకా ముప్పయి ఏళ్ళ ఆయుష్షు ఉంది తాయారు.' అని ధైర్యం చెప్పాడు దేవుడు. ఆపరేషన్ సక్సెస్ అయింది. ! తాయారు లేచి కూర్చుంది. దేవుడి మాట గుర్తొచ్చింది. అదే ఆసుపత్రిలో కాస్మెటిక్ విభాగంలో చేరింది. ఫేస్ లిఫ్ట్, లిపోసిన్ చేయించుకుంది. జుట్టుకి రంగు వేయించుకుంది. బయటికొచ్చింది. రోడ్డు దాటుతూ లారీ గుద్ది చనిపోయింది. మళ్లీ దేవుడి దగ్గరికి వెళ్లింది. 'ఇదేమిటి స్వామి! ఇంకా  ముప్పయి ఏళ్ళ ఆయుష్షు ఉందన్నావు. అప్పుడే చంపేశావేమిటి?!' దేవుణ్ని అడిగింది.

'ఓసి నీ మేకప్పు తగలెయ్యా! నిన్ను గుర్తు పట్టలేదు సుమీ!' అని దేవుడు నాలుక  కరుచుకున్నాడు.

**బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం గొప్పది**

## ప్రారంభించు


ఒకడు గుడికి వెళ్ళాడు. 'స్వామీ! నేను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను. నాకు పది లక్షలు అవసరం.  వారం రోజుల్లో లాటరీలో నాకు  పది లక్షలు వచ్చేలా చెయ్యి. నీదే భారం.' అని ప్రార్థించాడు.  వారం గడిచింది. లాటరీలో పది లక్షలు రాలేదు. అతడు గుడికి వెళ్ళాడు. 'ఏమిటి స్వామి! నా మొర పట్టించుకో లేదు. రెండు రోజుల్లో నాకు లాటరీలో పది లక్షలు రాక పోతే ఇక్కడే తల బాదుకుని చచ్చిపోతా!! అని హెచ్చరించి వెళ్లాడు. రెండు రోజులు గడిచాయి. లాటరీలో డబ్బు రాలేదు. 'ఇంతవరకు నాకు లాటరీలో పది లక్షలు రాలేదు. అందుకే చచ్చిపోతున్నా స్వామి' అని తల బాదుకో సాగాడు.  దేవుడి మాటలు వినిపించాయి. 'ఓరే దౌర్భాగ్యుడా! ముందు లాటరీ టికెట్ కొనరా!'అని.

**ప్రయత్నం లేకుండా ఫలితం ఆశించకు**



## ఎవరు పేద?






ఒక ధనికురాలు చీరెల దుకాణానికి వెళ్ళింది. 'చౌకగా ఒక చీరెను చూపించండి. మా అబ్బాయి పెళ్ళికి మా ఇంట్లో పని మనిషికి ఇవ్వాల్సి ఉంది' అంది. ఆమె ఒక తక్కువ రకం చీరెను తీసుకుని ఆమె వెళ్ళిపోయింది. ఆమె వెళ్లిన గంటకి ఒక పేద మహిళ వచ్చింది.

'అన్నా! మా యజమానురాలి కొడుకు పెళ్లికి నేను మా అమ్మ గారికి మంచి చీరె ఇవ్వాలను కుంటున్నాను. మంచి ఖరీదైన చీరెను చూపించు.'అంది. ఖరీదైన చీరెను కొనుక్కుని ఆమె వెళ్ళిపోయింది.

**పేదతనం మనసులో ఉండకూడదు**





## వరాలు


'నేను పైకి వెళ్ళాలి. నలుగురినీ పైకి తీసుకెళ్ళాలి' అని దేవుడిని వరం కోరాడు కాంతారావు. మరునాడు కాంతారావు లిఫ్ట్ బాయ్ గా మారాడు. 'లిఫ్ట్ లో నలుగురినీ పైకి తీసికెళ్ళటం కాదు స్వామీ! నా కంటి ముందు డబ్బులుండాలి' అని ప్రార్థించాడు. అంతే, ఏటిఎమ్ దగ్గర వాచ్ మన్ గా కూర్చున్నాడు.

'కంటి ముందు అంటే ఏటిఎమ్ కాదు స్వామి! నా టేబుల్ మీదకి డబ్బులు రావాలి'మొర పెట్టుకున్నాడు. మరునాడు కాంతారావు సులభ్ కాంప్లెక్స్ దగ్గర కూర్చున్నాడు. అతని టేబుల్ మీదకి డబ్బులు వస్తునే ఉన్నాయి.

**మన కోరికలలో స్పష్టత ఉండాలి**








## నీ కోసమే!

'మీ అమ్మకి సీరియస్ గా ఉంద'ని వృద్ధాశ్రమం నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే వెళ్లాడు వెంకట్. తల్లిని చూశాడు. 'బాబూ! నేను ఎక్కువ రోజులు బతకను. వెంటనే ఒక పని చేస్తావా?' అడిగింది తల్లి. 'చెప్పమ్మా! తప్పక చేస్తాను.' అన్నాడు వెంకట్.

'ఈ హెూమ్ లో ఏ.సి. పెట్టించు. వాషింగ్ మిషన్ ఏర్పాటు చెయ్యి. కలర్ టీవీ పెట్టు. మంచి బెడ్ వేయించు.' తల్లి చెప్పింది.

'అమ్మా! నీవు ఇక్కడున్న ఆరేళ్ళలోనూ అడగలేదు. చావు బతుకుల్లో ఉన్నావు. ఇప్పుడెందుకు ఇవన్నీ?' అడిగాడు కొడుకు.
'రేపు నీ కొడుకు కూడా నిన్ను ఇక్కడ చేరిస్తే నీవు చాలా కష్ట పడతావని ముందు జాగ్రత్త కోసం చెపుతున్నాను బాబూ!'అంది ఆ తల్లి.

**తల్లి ప్రేమకు సరిహద్దులు ఉండవు**






## ఆవిడ


సుబ్బారావు కొత్తగా స్కూటర్ కొన్నాడు. అది వేసుకుని రోడ్డు మీదకి వచ్చాడు. స్కూటర్ బ్యాలెన్స్ తప్పి కాలవలో పడ్డాడు సుబ్బారావు. మోచేతికి దెబ్బ తగిలింది. రక్తం వస్తోంది. ఎలాగో కాలవలోంచి పాకుతూ పైకొచ్చాడు. ఒక అందమైన అమ్మాయి ఎదురుగా కనిపించింది. ' అయ్యయ్యో! రక్తం వస్తోంది. నేను నర్స్ ని. పక్కనే మా ఇల్లు. మందు వేసి కట్టు కడతాను రండి' అంది.

'అమ్మో! మా ఆవిడ ఏమైనా అనుకుంటుంది' మొహమాట పడ్డాడు సుబ్బారావు. 'ఏం పర్వాలేదు. రండి' అని బలవంతంగా ఇంటికి తీసికెళ్ళింది. మందు వేసి కట్టు కట్టింది. 'కాఫీ తాగి వెళ్ళండి' అంది. 'అమ్మో! మా ఆవిడ బాధపడుతుంది' మళ్లీ మొహమాట పడ్డాడు. 'ఇంట్లో ఉన్న మీ ఆవిడకి ఎలా తెలుస్తుంది?' అందామె. 'ఇంట్లో కాదు. ఇంకా ఆ కాలవలోనే ఉంది!'

**మొహమాటం సమస్యలు తెచ్చి పెడుతుంది**



## కేటాయింపు



డెబ్బయి ఏళ్ళ తండ్రికి సీరియస్ అయింది. వెంటనే ఆపరేషన్ చేయాలన్నాడు డాక్టరు. ఆపరేషన్ కి యాభయి వేలు అవుతుందన్నాడు. కొడుకు మాత్రం మారు పలక లేదు.
డాక్టరు రోగి వైపు జాలిగా చూశాడు.
'బాబూ! ఆపరేషన్ చేయించరా. నా మనవడిని చూడాలి. వాడితో ఆడుకోవాలి. ఇంకా కొంతకాలం బతకాలని ఉందిరా!' బతిమాలాడు తండ్రి.

'నాన్నా! అంత డబ్బు ప్రస్తుతం నా దగ్గర లేదు. నీ అంతిమ క్రియలకు, నీకు పాలరాతి సమాధి కట్టించటానికి లక్షా యాభై వేలు దాచాను. అవి మాత్రం ఇప్పుడు ఖర్చు పెట్టను' ఖచ్చితంగా చెప్పాడు కొడుకు.

**బతికి ఉండగానే తల్లిదండ్రులను బాగా చూసుకోండి**

## చివరి వరం

సుందరి ఘోరమైన తపస్సు చేసింది. తపస్సుకి మెచ్చి దేవుడు ప్రత్యక్షమయ్యాడు. మూడు వరాలు ఇచ్చాడు. 'నీకిచ్చిన ప్రతి వరం నీ భర్తకు పది రెట్లు అవుతుంది. నీ మొదటి వరం కోరుకో !' అన్నాడు దేవుడు. 'నాకు గొప్ప అందం ఇవ్వు స్వామీ' అంది సుందరి. 'ఇచ్చాను' అన్నాడు దేవుడు.

'నాకు వంద కోట్లు ధనం ఇవ్వు స్వామి!' కోరింది. 'ఇచ్చాను. నీ భర్తకు పది రెట్లు వస్తుంది. నిన్ను పట్టించుకోక పోవచ్చు. జాగ్రత్తగా ఆలోచించుకో!- మూడో వరం ఏమిటి?' హెచ్చరించాడు దేవుడు. 'నాకు ఈ రాత్రికి తేలికపాటి గుండెపోటు ఇవ్వు స్వామి చాలు!' అంది సుందరి. దేవుడు బిత్తర పోయాడు.




**వరాలను కోరడానికీ తెలివి తేటలు ఉండాలి**

# కథలు చెప్పటంలో ఈ కళలు వాడాలి

## 4M - LAP TOP

ఈ సాంకేతిక పదాన్ని గుర్తు పెట్టుకోండి



M ధ్వన్యనుకరణ
IMICRY

M మూకాభినయం
IME

M ఇంద్రజాలం
AGIC

M ముఖ తొడుగులు
ASKS






L భాషా విన్యాసం
ITERATURE
RYTHOME

A చిత్రకళ-చేతి పనులు
RTS & CRAFTS

P చిట్టి బొమ్మలాట
UPPETRY


T ఆట బొమ్మలు
OYS

O కాగితంతో బొమ్మలు
RIGAMI

P పాప్ అప్ బుక్స్
OP UP BOOKS

ఈ ప్రక్రియలలో మీకు తేలిక అనిపించే, మీకిష్టమైన వాటిని ఉపయోగించి కథ చెప్పవచ్చు.

# తానా - తెలుగు పరివ్యాప్తి బృందం

## అంజయ్య చౌదరి లావు తానా అధ్యక్షులు

**డా॥ ప్రసాద్ తోటకూర**
నిర్వాహకులు, ప్రపంచ సాహిత్య వేదిక

**చినసత్యం వీర్నపు**
సమన్వయ కర్త, తానా తెలుగు పరివ్యాప్తి

**సతీష్ కొమ్మన**
ప్రాంతీయ ప్రతినిధి, డల్లాస్

**లోకేష్ నాయుడు**
కౌన్సిల్ ఎట్ లార్జ్

**మురళి వెన్నం**
బోర్డ్ ఆఫ్ డైరెక్టర్

**శ్రీకాంత్ పోలవరపు**
ఫౌండేషన్ కోశాధికారి

కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత
**చొక్కాపు వెంకటరమణ**
గౌరవ సలహాదారులు, తానా తెలుగు పరివ్యాప్తి

**శ్రీ అశోక్ బాబు కొల్లా**
కోశాధికారి

**మధు సుంకు**
సహ సమన్వయకర్త,
తానా తెలుగు పరివ్యాప్తి

**హరి శంకర్ రాజపుత్**
సహ సమన్వయకర్త,
తానా తెలుగు పరివ్యాప్తి

**రాధాకృష్ణ అట్లూరి**
సహ సమన్వయకర్త
తానా తెలుగు పరివ్యాప్తి

**ఫణి కంతేటి**
సభ్యులు,
తానా తెలుగు పరివ్యాప్తి

## వినదగునెవ్వరు చెప్పిన...



భాషా, సంస్కృతులను మన తరువాత తరానికి అందజేయాలనే సదుద్దేశంతో గత నాలుగు దశాబ్దాలుగా అమెరికాలో 'తానా' తెలుగు వారికి సేవలు అందిస్తూ, ఆస్టిన్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషను ప్రవేశ పెట్టడంలో చేసిన కృషి ఎంతో గొప్పది. 19వ 'తానా' మహా సభలలో మన తెలుగు కవులు, సాహితీ వేత్తలను ఘనంగా సత్కరించుకోవడంతో పాటు మాతృ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలలో కూడ తానా ప్రముఖ పాత్ర పోషించింది. 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా భావితరాల భాష పెంపుదలకు తానా పాఠశాలతో పాటు 'తానా తెలుగు పరివ్యాప్తి బృందం' నిర్వహిస్తున్న'కథాకేళి'తెలుగులో కథలు చెప్పే పోటీ పిల్లలు తెలుగు నేర్చుకోవడానికి మరింత సహకారాన్ని అందిస్తుందని, అందరూ తెలుగు భాష పరివ్యాప్తికి కృషి చేయాలని కోరుకుంటూ... 'కథాకేళి' వంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న 'తానా తెలుగు పరివ్యాప్తి బృందం' ను అభినందిస్తూ... తానా కార్యక్రమాలను ఆదరిస్తారని కోరుకుంటూ...

-మురళి వెన్నం, తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్

---



అమ్మ చేతిలో గోరు ముద్ద తెలుగు. రుచి రాగాల పాల ముద్ద తెలుగు.అమ్మ రూపమే తీయనైన భాష. సొంత భాషపై పట్టుంటేనే...పర భాషలపై పట్టు దొరుకుతుంది. అలాంటి తెలుగు భాషని ప్రపంచంలోని నలుమూలలా వున్న తెలుగు పిల్లలకు నేర్పించి మాతృ భాష పై మక్కువ కల్పించడానికి ఈ ప్రయత్నం చేస్తున్న తానా తెలుగు పరివ్యాప్తి బృందం వారికి కృతజ్ఞతలు. 23 వ తానా మహా సభలు 2023 సందర్భంగా తానా సంఘం వారు తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకి చేస్తున్న సేవలో అందరూ పాల్గొని తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతారని ఆశిస్తున్నాను.

- వెంకట రాజా కసుకుర్తి, కమ్యూనిటీ సర్వీసెస్ కో-ఆర్డినేటర్

# కార్య నిర్వాహక బృందం

## అంజయ్య చౌదరి లావు తానా అధ్యక్షులు

| | | |
|---|---|---|
| **నిరంజన్ శృంగవరపు**<br>కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు | **జయశేఖర్ తాళ్ళూరి**<br>పూర్వాధ్యక్షులు | **సతీష్ కుమార్ వేమూరి**<br>కార్యదర్శి |
| **అశోక్ బాబు కొల్ల**<br>కోశాధికారి | **మురళి తాళ్ళూరి**<br>సంయుక్త కార్యదర్శి | **భరత్ మద్దినేని**<br>సంయుక్త కోశాధికారి |
| **వెంకట (రాజా) కసుకుర్తి**<br>కమ్యూనిటీ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ | **శిరీష తూనుగుంట్ల**<br>కల్చరల్ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ | **డా॥ ఉమా ఆరమండ్ల కటికి**<br>ఉమెన్ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ |
| **లోకేష్ నాయుడు కొణిదల**<br>కౌన్సిల్ ఎట్ లార్జ్ | **వెంకట హితేష్వర్ వడ్లమూడి**<br>అంతర్జాతీయ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ | **శశాంక్ యార్లగడ్డ**<br>స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ |
| **డా॥ హనుమయ్య బండ్ల**<br>డైరెక్టర్ | **వెంకట ఆర్ యార్లగడ్డ**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు (ఛైర్మన్, తానా ఫౌండేషన్) | |

# ప్రాంతీయ ప్రతినిధులు

| | | | | |
|---|---|---|---|---|
| **నాగమల్లేశ్వర పంచుమర్తి**<br>ప్రాంతీయ ప్రతినిధి, అప్పలాచియన్ | **శ్రీనివాస్ వుయ్యూరు**<br>ప్రాంతీయ ప్రతినిధి, క్యాపిటల్ | **సునీల్ కోగంటి**<br>ప్రాంతీయ ప్రతినిధి, మిడ్ అట్లాంటిక్ | **హనుమంత చెరుకూరి**<br>ప్రాంతీయ ప్రతినిధి, మిడ్వెస్ట్ | |
| **ప్రదీప్‌కుమార్ గడ్డం**<br>ప్రాంతీయ ప్రతినిధి, న్యూఇంగ్లండ్ | **వంశీ వాసిరెడ్డి**<br>ప్రాంతీయ ప్రతినిధి, న్యూజెర్సీ | **శ్రీనివాస్ గోగినేని**<br>ప్రాంతీయ ప్రతినిధి, నార్త్ | **పద్మ భోగవల్లి**<br>ప్రాంతీయ ప్రతినిధి, నార్త్ వెస్ట్ | **రత్న గుమ్మడి**<br>ప్రాంతీయ ప్రతినిధి, సౌత్ వెస్ట్ |
| **రామ్ తోట**<br>ప్రాంతీయ ప్రతినిధి, నార్త్ కాలిఫోర్నియా | **సాయి బొల్లినేని**<br>ప్రాంతీయ ప్రతినిధి, నార్త్ సెంట్రల్ | **దిలీప్‌కుమార్ ముసునూరు**<br>ప్రాంతీయ ప్రతినిధి, న్యూయార్క్ | **రవిచంద్ర వడ్లమూడి**<br>ప్రాంతీయ ప్రతినిధి, ఓహాయో వ్యాలీ | |
| **సరిత్ కొమ్మినేని**<br>ప్రాంతీయ ప్రతినిధి, రాఖీ మౌంటైన్స్ | **ప్రతాప్ చెరుకూరి**<br>ప్రాంతీయ ప్రతినిధి, సదరన్ కాలిఫోర్నియా | **కిషోర్ యార్లగడ్డ**<br>ప్రాంతీయ ప్రతినిధి, సౌత్ సెంట్రల్ | **వెంకటరమణ మీసాల**<br>ప్రాంతీయ ప్రతినిధి, సౌత్ ఈస్ట్ | |

# కో-ఆర్డినేటర్స్ బృందం

| | | |
|---|---|---|
| **ఠాగూర్ మల్లినేని**<br>మీడియా కో-ఆర్డినేటర్ | **శ్రీనివాస్ కూకట్ల**<br>ఈవెంట్ కో-ఆర్డినేటర్ | **శ్రీనివాస్ యలవర్తి**<br>మెంబర్షిప్ బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ |

# ఫౌండేషన్ బృందం

| | | |
|---|---|---|
| **వెంకట ఆర్ యార్లగడ్డ**<br>ఫౌండేషన్ చైర్మన్ | **శశికాంత్ వల్లేపల్లి**<br>ఫౌండేషన్ కార్యదర్శి | **శ్రీకాంత్ పోలవరపు**<br>ఫౌండేషన్ కోశాధికారి |
| **విశ్వనాధ్ నాయునిపాటి**<br>ఫౌండేషన్ సంయుక్త కోశాధికారి | **రమాకాంత్ కోయ**<br>ఫౌండేషన్ ట్రస్టీ | **రవి సామినేని**<br>ఫౌండేషన్ ట్రస్టీ |
| **సురేష్ పుట్టగుంట**<br>ఫౌండేషన్ ట్రస్టీ | **శ్రీనివాస్ చంద్ గొర్రెపాటి**<br>ఫౌండేషన్ ట్రస్టీ | **కిరణ్ గోగినేని**<br>ఫౌండేషన్ ట్రస్టీ (నాన్-డోనార్) |
| **పురుషోత్తం సి గుదె**<br>ఫౌండేషన్ ట్రస్టీ (నాన్-డోనార్) | **వినయ్ మద్దినేని**<br>ఫౌండేషన్ ట్రస్టీ (నాన్-డోనార్) | **శ్రీనివాస్ ఓరుగంటి**<br>ఫౌండేషన్ ట్రస్టీ (నాన్-డోనార్) |
| **సుమంత్ రాంసెట్టి**<br>ఫౌండేషన్ ట్రస్టీ | **విద్యాధర్ గారపాటి**<br>(యు.ఎస్.ఏ)<br>ఫౌండేషన్ ట్రస్టీ (డోనార్) | **అంజయ్య చౌదరి లావు**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు (అధ్యక్షులు) |

# బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బృందం
## 2021-2023

| | | |
|---|---|---|
| **డా॥ హనుమయ్య బండ్ల**<br>డైరెక్టర్ | **డా॥ నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి**<br>డైరెక్టర్ (నాన్-డోనార్) | **లక్ష్మి దేవినేని**<br>డైరెక్టర్ (డోనార్) |
| **జనార్ధన్ నిమ్మలపూడి**<br>డైరెక్టర్(నాన్-డోనార్) | **శ్రీనివాస్ లావు**<br>డైరెక్టర్ | **డా॥ చౌదరి జంపాల**<br>డైరెక్టర్ |
| **మురళి వెన్నం**<br>డైరెక్టర్ | **అంజయ్య చౌదరి లావు**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు (అధ్యక్షులు, ఈ.సి) | **నిరంజన్ శృంగవరపు**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు,ఈ.సి) |
| **జయశేఖర్ తాళ్ళూరి**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(పూర్వాధ్యక్షులు) | **సతీష్ కుమార్ వేమూరి**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు ( కార్యదర్శి, ఈ.సి) | **అశోక్ బాబు కొల్లా**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(కోశాధికారి, ఈ.సి) |
| **వెంకట ఆర్ యార్లగడ్డ**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(చైర్మన్, తానా ఫౌండేషన్) | **శశికాంత్ వల్లేపల్లి**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(కార్యదర్శి, తానా ఫౌండేషన్) | **శ్రీకాంత్ పోలవరపు**<br>ఎక్స్-అఫీషియో సభ్యులు<br>(కోశాధికారి, తానా ఫౌండేషన్) |

# సౌజన్య మూర్తులు
## SPONSORS



**శ్రీ వెంకట రాజా కసుకుర్తి**
మరియు కుటుంబ సభ్యులు



**డా. ప్రసాద్ తోటకూర**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ మురళి వెన్నం**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ చినసత్యం వీర్నపు**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ రవి పొట్లూరి**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ సతీష్ కొమ్మన**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ శ్రీకాంత్ పోలవరపు**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ అశోక్ బాబు కొల్లా**
మరియు కుటుంబ సభ్యులు



**శ్రీ లోకేష్ నాయుడు కొణిదల**
మరియు కుటుంబ సభ్యులు

23 వ తానా మహా సభలు 2023

# 'కథా' కేళి



**Recommended Age Group:** 5 to 20+ years

**Kathakeli - Story Telling Competetion in Telugu- 100 Short Stories model handbook**
**Organised by:** Anjaiah Choudary Lavu, President, Telugu Association of North America,
**Concept:** Dr.Prasad Thotakura, China Satyam Veernapu, TANA-Telugu Language promotion team,
**Content & Editor:** Chokkapu Venkata Ramana, **Book Designing:** Envizon Studio, Hyderabad, India.

©2023 TANA, All rights reserved.

Design by: www.envizonstudio.com / +91 98 4949 9191